నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 1-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 293 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఏడేండ్లలో రూ. 2.20 లక్షల కోట్ల పెట్టుబడులు : మంత్రి కేటీఆర్

రంగారెడ్డి,జులై 31: పారిశ్రామిక రంగంలో భారతదేశంలోనే తెలంగాణ (ఎవర్జీజీనిణజీనిజీ) ముందు వరుసలో ఉంది.. వేగంగా దూసుకెళ్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ (ఐఖీ)తెలిపారు. 2015 నుంచి ఇప్పటి వరకు టీఎస్ ఐపాస్ (యూ ఎఖయూ) ద్వారా తెలంగాణకు రూ. 2.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు.

రంగారెడ్డి జిల్లా కొత్తూరు సమీపంలోని మేకగూడలో పోకర్ణ ఇంజనీర్స్ స్టోన్ లిమిటెడ్ కంపెనీని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో సమర్థవంతమైన నాయకత్వం, సుస్థిరతతో కూడిన ప్రభుత్వం ఉన్నందునే పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఈ రెండు సమతుల్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో సమతుల్యమైన అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తూనే, ఉపాధి కల్పనలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

టీఎస్ ఐపాస్ లాంటి విప్లవాత్మక సంస్కరణలు ఎన్నో చేపట్టామని తెలిపారు. టీఎస్ ఐపాస్ లాంటి పాలసీ ఏ రాష్ట్రంలో లేదు. 15 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నాం. 15 రోజుల్లో అనుమతి రాకపోతే డీమ్డ్ అప్రూవ్డ్‌గా భావించవచ్చు అని పేర్కొన్నారు. పరిశ్రమలకు నిరాంతరాయంగా నాణ్యమైన కరెంటు, నీళ్లు అందిస్తున్నామని తెలిపారు.

పోకర్ణ కంపెనీలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కంపెనీకి అన్ని విధాలా తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కలిసికట్టుగా ముందుకు నడిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

టీఎస్ ఐపాస్ అద్భుతం : గౌతమ్ చంద్

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక పాలసీ టీఎస్ ఐపాస్ అద్భుతంగా ఉందని పోకర్ణ లిమిటెడ్ చైర్మన్ గౌతమ్ చంద్ పేర్కొన్నారు. తక్కువ సమయంలో పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో దేశంలోనే అతి పెద్ద మార్బుల్ పరిశ్రమను మేకగూడలో ఏర్పాటు చేశామని తెలిపారు. ప్లాంట్‌లో సూపర్ జంబో, జంబో స్లాబులను ఉత్పత్తి చేస్తున్నామని గౌతమ్ చంద్ చెప్పారు.

కరోనా కలకలం : ఎమర్జెన్సీ ప్రకటించిన జపాన్

టోక్యో,జులై 31: కరోనా వైరస్ కేసులు రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో టోక్యో సహా ఆరు ప్రాంతాల్లో జపాన్ ఎమర్జెన్సీ ప్రకటించింది. టోక్యో, సైతమ, చిబ, కనగవ, ఒసాకా, ఒకినవ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ పరిస్థితిని ప్రధాని సుగ ప్రకటించారని జపాన్ ప్రధాని కార్యాలయం శనివారం వెల్లడించింది. హ్యాక్కైడొ, ఇషికవ, క్యోటో, హ్యోగో, ఫకుఒక ప్రాంతాలకు వైరస్ ప్రబలకుండా కఠిన చర్యలు చేపడతామని తెలిపింది.

అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు వెళ్లరాదని ప్రయాణాలకు దూరంగా ఉండాలని జపాన్ ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేస్తోందని పీఎంఓ కార్యాలయం స్పష్టం చేసింది. కరోనా నిబంధనలను ప్రజలు విధిగా పాటించాలని కోరింది. ఆగస్ట్ మాసాంతానికి 40 శాతం ప్రజలకు వ్యాక్సిన్ రెండు డోసులు అందించే దిశగా టీకాల కార్యక్రమాన్ని వేగవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించిందని తెలిపింది.

కొవిడ్ బారినపడిన 50 ఏండ్లు పైబడిన వారు తీవ్ర లక్షణాలకు లోనుకాకుండా మెరుగైన చికిత్సను ప్రభుత్వం ఆయా రోగులకు అందుబాటులోకి తీసుకురానుందని పేర్కొంది. వైరస్ ఇన్ఫెక్షన్లను నివారించడం, వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయడానికి అన్ని చర్యలూ చేపడతామని తెలిపింది.

ఇఫ్కో నానో యూరియాల వాడకంతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు : మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్ , జులై 31: నానో యూరియా సాధారణ రైతు బిడ్డ విజయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ జిల్లా కలోల్ లోని ఇఫ్కో యూరియా, నానో యూరియా తయారీ ప్లాంట్లను మంత్రి శనివారం సందర్శించారు. ఇఫ్కో వైస్ చైర్మన్, జాతీయ సహకార సంఘాల అధ్యక్షులు, మాజీ ఎంపీ దిలీప్ సంగానియా, ఇఫ్కో కలోల్ యూనిట్ హెడ్ ఇనాందార్, నానో యూరియా సృష్టికర్త, శాస్త్రవేత్త, జీఎం రమేష్ రాలియా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నానో యూరియా సృష్టికర్త, శాస్త్రవేత్త రమేష్ రాలియాను మంత్రి అభినందించి, సన్మానించారు.

రమేష్ రాలియా బయో (నానో) టెక్నాలజీలో ఏడేళ్లు అమెరికాలో పరిశోధనలు చేసి తన జ్ఞానం, తన పరిశోధనా ఫలాలు అత్యధిక మంది రైతులున్న భారతదేశానికి ఉపయోగపడాలని దేశానికి తిరిగివచ్చి ఇఫ్కోలో చేరి మరో మూడేళ్లు పరిశోధనలు చేసి లిక్విడ్ నానో యూరియాను కనిపెట్టడం గర్వకారణం అని మంత్రి పేర్కొన్నారు. 500 ఎంఎల్ లిక్విడ్ నానో యూరియా బాటిల్‌ను 127 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే ఎకరాకు సరిపోతుందన్నారు. కేవలం రూ.240కి లభించే ఈ బాటిల్ మూలంగా ప్రభుత్వాల మీద పెద్ద ఎత్తున సబ్సిడీ భారం తప్పుతుందన్నారు.

భవిష్యత్ అంతా నానో టెక్నాలజీదే..

ఇఫ్కో భారత రైతాంగ సహకార సంస్థ. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇది మనది కావడం మనకు గర్వకారణం. అటువంటి ఇఫ్కో సంస్థ పరిశోధనల నుండి ప్రపంచ పేటెంట్ కలిగిన నానో యూరియా రావడం దానిని ప్రపంచానికి అందించడం మన దేశ సౌభాగ్యానికి తోడ్పడుతుంది. ఇది వ్యవసాయంలో ఎరువుల వాడకంలో కొత్త విప్లవానికి నాంది పలుకుతుంది. భవిష్యత్ అంతా నానో టెక్నాలజీదేనన్నారు. నానో యూరియాతో భూసారం పెరగడంతో పాటు, పంట దిగుబడి శాతం సాధారణం కన్నా 8 శాతం అధికంగా ఉంటుందన్నది పరిశోధనలలో తేలిందన్నారు.

ప్రభుత్వపరంగా భూమితో పాటు ఇతర సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి కేసీఆర్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అండతో అన్ని రకాల సహకారాలు అందిస్తామని తెలిపారు. దక్షిణ తెలంగాణలో ప్లాంట్ ఏర్పాటు మూలంగా కశ్మీర్ ? కన్యాకుమారి, ముంబయి ? విజయవాడ ? కోల్‌కతా రహదారులు అందుబాటులో ఉండడంతో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ లకు అందుబాటులో ఉంటుందన్నారు.

నానో ఎరువుల వాడకంతో విప్లవాత్మక మార్పు..

కేంద్ర ప్రభుత్వం దేశంలో నానో యూరియా విస్తృత వాడకానికి సహకారం అందించాలన్నారు. రైతులు దీనిని విరివిగా వాడేలా ప్రోత్సాహం అందించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని ప్రోత్సహించడంతో సాగులో ఎరువులు, రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని రైతులను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. పెరిగిన సాగు దృష్ట్యా తెలంగాణలో ఇఫ్కో నానో యూరియా ప్లాంటును ఏర్పాటు చేయాలని ఇఫ్కో వైస్ చైర్మన్ దిలీప్ సంగానియాకు విజ్ఞప్తి చేశారు. ఎరువుల వాడకంలో సాంప్రదాయ పద్ధతులతో నష్టపోతున్న రైతాంగాన్ని నానో ఎరువుల వైపు మళ్లించడం మూలంగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పు మొదలవుతుందన్నారు.

రాష్ట్రంలో కరోనా అదుపులోనే ఉంది : డీహెచ్ శ్రీనివాసరావు

హైదరాబాద్ , జులై 31:తెలంగాణ రాష్ట్రంలో కరోనా అదుపులోనే ఉందని వైద్య ఆరోగ్య సంచాలకుడు జీ శ్రీనివాస రావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భారత్ సహా 135 దేశాల్లో డెల్టా వైరస్ తీవ్రత అధికంగా ఉందని వెల్లడించారు. డెల్టా ఉధృతి కారణంగా అనేక దేశాలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. మానవ శరీరంపై డెల్టా వైరస్ ప్రభావం ఎక్కువ కాలం ఉంటుందని తెలిపారు. ఇన్ఫెక్షన్ కలిగించే సామర్థ్యాన్ని ఈ రకం వైరస్‌లో గుర్తించామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 2 డెల్టా ప్లస్ కేసులు..

"రాష్ట్రంలో 2 డెల్టా ప్లస్ కేసులు నమోదయ్యాయి. కరోనా రెండో దశ ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ ప్రాంతాల్లో అధికంగా కేసులు నమోదవుతున్నాయి. కరోనా బాధితులు బయట తిరగొద్దు. 9 జిల్లాల్లో కేసులు ఎక్కువగా ఉన్నాయి. కరోనా మూడో దశకు మారకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రాష్ట్రంలో 2.2 కోట్ల మంది వ్యాక్సినేషన్‌కు అర్హులు. ఇప్పటివరకు 1.12 కోట్ల మందికి ఓ డోసు వ్యాక్సిన్ ఇచ్చాం. 33.79 లక్షల మందికి రెండు డోసులు వేశాం. కేంద్రం నుంచి అదనంగా 9.5 లక్షల డోసులు వచ్చాయి. ఒకట్రెండు వారాల్లో రెండో డోసుకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం. కరోనా మూడో దశను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్నాం. ప్రభుత్వ దవాఖానల్లో 26 వేల ఆక్సిజన్ పడకలు అందుబాటులో ఉన్నాయి.. పిల్లల కోసం జిల్లా దవాఖానల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం' అని డీహెచ్ శ్రీనివాస రావు తెలిపారు.

దేశంలో కొత్తగా 41,649 కరోనా కేసులు

న్యూఢిల్లీ, జులై 31: దేశంలో కరోనా విజృంభణ కొనసాగుతున్నది. దేశంలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 41,649 కొవిడ్ కేసులు రికార్డయ్యాయని కేంద్ర కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. మరో 37,291 మంది బాధితులు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. మహమ్మారి బారినపడి మరో 593 మంది బాధితులు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం దేశంలో 4,08,920 యాక్టివ్ కేసులున్నాయని మంత్రిత్వశాఖ పేర్కొంది. తాజాగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 3,16,13,993కు పెరిగింది.

ఇందులో 3,07,81,263 మంది కోలుకున్నారు. వైరస్ బారినపడి 4,23,810 మంది మృతి చెందారు. టీకా డ్రైవ్‌లో భాగంగా 46,15,18,479 డోసులు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ వివరించింది. మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 1.29శాతం ఉన్నాయని, ప్రస్తుతం రోజువారీ పాజిటివిటీ రేటు 2.42శాతం ఉందని పేర్కొంది. రోజువారీ పాజిటివిటీ రేటు 2.34శాతం ఉందని చెప్పింది. ఇప్పటి వరకు దేశంలో 46.64 కోట్ల కొవిడ్ శాంపిల్స్ పరీక్షించినట్లు వివరించింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యం : మంత్రి తలసాని

హైదరాబాద్ , జులై 31: కులవృత్తులకు చేయూతను అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గొర్రెల పంపిణీ, సంపద అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అన్ని జిల్లాల పశువైద్యాధికారులు, పశు సంవర్ధకశాఖ అధికారులతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, 2వ విడత గొర్రెల పంపిణీపై తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అనిత రాజేంద్ర, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ రాంచందర్, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, టీఎస్ఎల్‌డీఏ సీఈఓ మంజువాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో పశుసంవర్ధకశాఖకు సీఎం కేసీఆర్ అందిస్తున్న సహకారంతో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన మొదటి విడత గొర్రెల పంపిణీ అద్భుత ఫలితం ఇచ్చిందన్నారు. 2వ విడత పంపిణీ కోసం సర్కారు రూ.6 వేల కోట్లు విడుదల చేసిందని, ఈ నెల 28న హుజూరాబాద్‌లో పంపిణీ లాంఛనంగా ప్రారంభమైందని గుర్తుచేశారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని గొర్రెల యూనిట్ ధరను రూ.1.25 లక్షల నుంచి 1.75 లక్షలకు సీఎం పెంచారని చెప్పారు. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా పశువైద్యాధికారులకు సూచించారు. పంపిణీ చేసే గొర్రెలకు కొనుగోలు చేసిన ప్రాంతంలోనే బీమా పత్రాలను అందజేసేలా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గొర్రెలు చనిపోతే సకాలంలో బాధితులకు బీమా అందించేలా చూడాలని ఆదేశించారు.

పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు..

పెరిగిన జీవాలకు అనుగుణంగా గ్రాసం కొరత రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుంది. రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. జీవాల వద్దకే వైద్యసేవలు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రారంభించిన సంచార పశువైద్య శాలల పనితీరు పట్ల నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో 79.16 లక్షల గొర్రెలను పంపిణీ చేయగా, వాటికి కోటి 30 లక్షల పిల్లలు పుట్టినట్లు తెలిపారు. వీటి విలువ రూ.7,800 కోట్లు ఉంటుందని వివరించారు. అంతేకాకుండా 93వేల టన్నుల మాంసం ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు.

ప్రతి జిల్లా కేంద్రంలో గొర్రెల మార్కెట్ నిర్మాణం..

గొర్రెల పెంపకందారులు గొర్రెలను అమ్ముకునేందుకు, కొనుగోలు చేసేందుకు అన్నిరకాల సౌకర్యాలు, వసతులతో కూడిన మార్కెట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఖమ్మం, పెద్దపల్లి, వనపర్తి తదితర జిల్లాలలో గొర్రెల మార్కెట్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రతి జిల్లా కేంద్రంలో గొర్రెల మార్కెట్ నిర్మాణానికి అవసరమైన 5 ఎకరాల భూమిని ఆయా జిల్లా కలెక్టర్ల సహకారంతో గుర్తించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పశు వైద్యశాలలను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని, మొదటి విడతలో సుమారు 480కి పైగా దవాఖానల్లో మౌలిక సౌకర్యాలు, వసతులను కల్పించనున్నట్లు వివరించారు. జీవాలకు వైద్య సేవలు అందించే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తుందని అన్నారు.

షెడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలి..

ప్రభుత్వం కొనుగోలు చేసి జిల్లాల్లోని పశువైద్య శాలలకు సరఫరా చేస్తున్న మందులను మాత్రమే కాకుండా రైతుల కావాల్సిన మందులు ఏమైనా ఉంటే సమగ్ర సమాచారం సేకరించి వాటి కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జీవాలకు వైద్య సేవలు, గొర్రెల పంపిణీ పంపిణీ వంటి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో గోపాలమిత్రల సేవలను వినియోగించుకోవాలని మంత్రి చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఔఖీఇఊ) క్రింద గొర్రెలు, పశువుల షెడ్ ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

టీఎస్ పీఈసెట్-2021 దరఖాస్తు గడువు పొడిగింపు

హైదరాబాద్ , జులై 31: టీఎస్ పీఈసెట్ దరఖాస్తు గడువును మరోసారి పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆలస్య రుసుము లేకుండా ఆగస్టు 13 వరకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ), బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం పీఈసెట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కరోనా పరిస్థితుల కారణంగా చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తుకు గడువు పెంచాలని సెట్ చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు గడువు పెంచేందుకు ఆయన సుముఖతం వ్యక్తం చేశారని టీఎస్ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు.

300 కుక్కులను చంపి .. గోయ్యిలో పడేశారు

హైదరాబాద్ , జులై 31: మూగ జీవాలపై పశ్చిమ గోదావరి జిల్లా లింగపాలెం పంచాయతీ అధికారులు ప్రదర్శించిన తీరుపై దుమారం రేపుతోంది. విశ్వాసానికి మారుపేరు అయిన గ్రామసింహాలను అతి పాశవికంగా చంపేశారు. ఒకటి, రెండు కాదు.. ఏకంగా 300 మూగజీవాలను పొట్టున పెట్టుకున్నారు. ఎలాంటి కనికరం చూపకుండా విషపు ఇంజక్షన్లతో చంపేశారు. చనిపోయిన కుక్కల కళేబారాలను చెరువు వద్ద గొయ్యిలో పడేశారు. కనీసం మట్టి కూడా పూడ్చకుండా వదిలేశారు. ఈ ఘటనపై జంతు ప్రేమికులు మండిపడుతున్నారు. ఈ చర్యలకు పాల్పడ్డ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫైట్ ఫర్ యనిమల్ అనే ఓ ఎన్జీవో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మరోవైపు కుక్కలు తరచూ దాడులకు తెగపడుతున్నాయనే వాటిని చంపామని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. స్థానిక ప్రజలు, రోడ్డుపై వేళ్లే వాహనదారులకు భయాందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కారణంగా విషం పెట్టి చంపినట్లు స్పష్టం చేశారు.శునకాలను ఇష్టారీతిగా చంపడాన్ని ఫైట్ ఫర్ యనిమల్స్ సంస్థకు చెందిన చల్లపల్లి శ్రీలత ఖండించారు.

ఆగస్టు నుండి నూతన రేషన్ కార్డుదారులకు 10 కిలోల ఉచిత బియ్యం పంపిణీ

హైదరాబాద్ , జులై 31: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసిన నూతన రేషన్ కార్డులకు బియ్యం పంపిణీకి సర్వం సిద్ధమయింది. ఆగస్టు మాసం నుండే వారికి రేషన్ అందించబోతున్నారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు తాజాగా రాష్ట్రంలో అర్హులైన సుమారు 3 లక్షల 9 వేల 83 కొత్త కార్డుల్లోని 8.65 లక్షల లబ్దిదారులకు ఆగస్టు నుండి ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం చొప్పున ఆగస్టు నుండి నవంబర్ వరకు నాలుగు నెలల పాటు పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇందుకై అదనంగా నెలకు రూ.23.10 కోట్లతో 4 నెలలకు రూ.92.40 కోట్లు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయన్నట్లు మంత్రి చెప్పారు. ఆగస్టు నెల పంపిణి 3వ తేదీ నుండి ప్రారంభిస్తామని తెలియజేసారు.

చరిత్రలో నేటినిజం



స్నేహమేగా ఊపిరి - స్నేహమేగా ఆనందసాగరం

(01 ఆగష్టు 'అంతర్జాతీయ స్నేహ దినం' సందర్భంగా)

1930 దశకంలో హాల్‌మార్క్ కార్డుల వ్యాపారి 'జోయ్ హాల్' ప్రవేశ పెట్టిన స్నేహ దినాన్ని 1958 నుంచి పెరుగ్వే 'అంతర్జాతీయ స్నేహ దినం (ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)'గా పాటించడం ప్రారంభించింది. 2011 నుంచి ఐరాస కూడా అంతర్జాతీయ స్నేహ దినాన్ని (30 జూలైన) పాటిస్తున్నది. త్యాగానికి నిలువెత్తు నిదర్శనం స్నేహం. అవధులు లేని స్నేహాన్ని ఆస్వాదించడం ఓ నేర్పు. మనసులో మాటను, సుఖదుఃఖాలను పంచుకోవడానికి, మనసును తేలిక పరుచుకోవడానికి ఓ అద్భుత నేస్తం కావాలి. అమ్మ రొమ్ము పాల వలె స్నేహ హస్తం కూడా స్వచ్ఛమైంది, పవిత్రమైందని మనకు తెలుసు. స్నేహితులు లేని వారుండరు. ప్రాణమిత్రులను కలిగి ఉండడం ఓ అదృష్టం. అదో దేవుడిచ్చిన అపురూప వరం. స్నేహబంధానికి కులమతాల విబేధాలు లేవు, ఆర్థిక అంతరాలు ఉండవు. స్నేహ బంధాన్ని గుర్తు చేసుకోవడం, ప్రాణమిత్రులను కలుసుకోవడం, ఉల్లాసంగా ప్రకృతిలో మిత్రులతో గడపడం, కలిసి భోజనాలు చేయడం, స్నేహితునికి కృతజ్ఞతలు తెలపడానికి వేదికగా ప్రతి ఏటా ఆగష్టు తొలి ఆదివారం, అనగా 01 ఆగష్టు 2021న ప్రపంచదేశాలు 'అంతర్జాతీయ స్నేహ దినం' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ స్నేహ దినం-2021 నినాదంగా 'అంతర్జాతీయ స్నేహ లోతులు పెంచుదాం'ను తీసుకున్నారు. వ్యక్తుల మధ్యనే కాకుండా ఇరుగుపొరుగు, ప్రాంతాలు, దేశాల మధ్య కూడా స్నేహ వాతావరణం పెరిగితేనే విశ్వ శాంతి కపోతం స్వేచ్ఛగా ఎగురుతుంది. ఈ రోజున ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు ధరించడం, గ్రీటింగ్ కార్డులు/కానుకలు పంచుకోవడం, ప్రకృతి ఒడిలో ఆనందంగా గడపడం, కేకులు కట్ చేయడం, మిఠాయిలు పంచుకోవడం లాంటి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.

'నీ స్నేహితులెవరో తెలిస్తే నీ వ్యక్తిత్వం సుస్పష్టమవుతుందనే' నినాదం మనకు తెలుసు. స్నేహం జీవితంలో ఓ అంతర్భాగం. కుటుంబ సభ్యులు, సమీప బంధువులతో పంచుకోలేని పలు రహస్యాలకు కూడా స్నేహితులతో పంచుకోవడం, సలహాలు తీసుకోవడం, మనసులో భావాలను పంచుకోవడం జరుగుతుంది. స్నేహ బంధం భర్తీ చేయలేని అద్వితీయ భావన. సద్గుణాలు కలిగిన ప్రాణమిత్రులను పొందడం ఓ అదృష్టం. స్నేహితుడు బాధలో ఉపశమన లేపనంగా, సంతోషాన్ని రెట్టింపు చేసే చెలిమి చెలిమగా, ప్రమాదంలో ఆపన్న హస్తంగా, జారినపుడు ఊత కర్రగా, ఎదుగుదలలో పారాచూట్‌గా, ఆనందసాగర సృష్టికర్తగా, ఒత్తిడిని హరించే మృదు స్పర్శగా, అనారోగ్యంలో ఔషధంగా, మండుటెండలో మహావృక్ష నీడగా, నిరుత్సాహ వేళ ప్రేరణ కలిగించే అమృత హస్తంగా, ప్రతి పశ్నకు సరైన సమాధానమైన 'పవిత్ర స్నేహబంధం' బహు విధాలుగా ఉపయోగపడుతున్నది. హృదయాలను గెలిస్తే సంతోషాల ఆకాశంలో విహరించ వచ్చు. సుఖాలను, స్వార్థాలను, లాభాలను మాత్రమే కోరుకునేది స్నేహం అసలే కాదు. జీవితాంతం మన వెంట వచ్చే అపురూప నిధి స్నేహం. పిల్లల నుండి పండు ముసలి వరకు స్నేహితుడు లేని వ్యక్తులు కనిపించరు. అందమైన స్నేహ భావానికి జంతువులు కూడా మినహాయింపు కాదు. దేవుడిచ్చిన అమూల్య వరమైన స్నేహంలో స్వార్థ బుద్ధికి తావు ఉండదు. వర్ణ వర్గ జాతి విభేదాలను మరిపించి మానసికంగా ఏకం చేయగల అపారశక్తి స్నేహానికి ఉంటుంది. సంతోషాన్ని పంచుకునే వారు సాధారణ స్నేహితులైతే, దుఃఖంలో కన్నీటిని దుడిచే హస్తలే అసలైన స్నేహితులు అవుతారు. అందరికీ అనేకులు స్నేహితులు ఉంటారు, కాని కొందరు మాత్రమే ప్రాణమిత్రులు ఉంటారనేది వాస్తవం. స్నేహానికి దూరాలు, కంచెలు, సరిహద్దులు అడ్డురాలేవు. స్నేహబంధం పరమ పవిత్రమని, స్నేహ హస్తాన్ని కోరుకోవడం, స్నేహహస్తాన్ని అందించడం మనందరి కర్తవ్యమని తెలుసుకుందాం. స్నేహానికి ఇవ్వడం మాత్రమే తెలుసు, తీసుకోవడాన్ని ఆశించదు. అపురూపమైన స్నేహాన్ని ఆసాంతం ఆస్వాదిద్దాం, ఆనందతీరాలు విహరిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మధ్యప్రదేశ్‌లోని ఛిందవారాలో దివ్యాంగుల కోసం "సామాజిక్ అధికారిత శివిర్"

న్యూఢిల్లీ, జులై 31:కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన ఏడీఐపీ పథకం కింద, దివ్యాంగులకు సాయం, సహాయక పరికరాలను అందజేసేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇమ్లికేడా ఛిందవారాలో ఉన్న ఎఫ్‌డీడీఐ వద్ద "సామాజిక్ అధికారిత శివిర్" నిర్వహించనున్నారు. 'అలిమ్‌కో', చిద్వారా జిల్లా యంత్రాంగం సహకారంతో 'దివ్యాంగుల సాధికారత విభాగం' (డీఈపీడబ్ల్యూడీ) 31.07.2021న ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

రూ.4.32 కోట్ల విలువైన 8291 సహాయక పరికరాలను 4146 మంది దివ్యాంగులకు ఉచితంగా పంచనున్నారు. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ, బ్లాక్/పంచాయతీ స్థాయుల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది.

31.07.2021న ఉదయం 11 గంటలకు కార్యక్రమం పారంభమవుతుంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా వర్చువల్ పద్ధతిలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రి శ్రీ వీరేంద్ర కుమార్ అధ్యక్షత వహిస్తారు. మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సుశ్రీ ప్రతిమ భౌమిక్, రాజ్యసభ సభ్యుడు శ్రీ వికాస్ మహాత్మే, చింద్వారా ఎంపీ శ్రీ నకుల్‌నాథ్ నేరుగాగానీ, వర్చువల్ పద్ధతిలోగానీ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. డీఈపీడబ్ల్యూడీ కార్యదర్శి శ్రీమతి అంజలి భావ్రా, ఇతర సీనియర్ అధికారులు, అలిమ్‌కో, జిల్లాకు చెందిన అధికారులు కూడా వర్చువల్‌గాగానీ, నేరుగాగానీ హాజరవుతారు.

యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ అక్రమార్జన చిట్టా

యాదగిరిగుట్ట, జులై 31:యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ దేవానంద్ అక్రమార్జన చిట్టా బయటపడుతోంది. డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ యాదగరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ దేవానంద్ నివాసంలో రూ.76 లక్షల నగదు లభ్యమైంది. దీనిని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామపంచాయతీ లేఅవుట్‌లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ గురువారం(జులై 29) ఏసీబీకి పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు ఏకకాలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలంలోని ఆయన నివాసంలో గురువారం అర్ధరాత్రి పొద్దుపోయే వరకు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.76,09,500 నగదు, తొమ్మిది మద్యం సీసాలు, 27.06 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు 7.09 ఎకరాల భూమి, 200 గజాల ఇంటి స్థలం డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతోపాటు యాదాద్రిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతుండటంతో శివారు ప్రాంతంలో కొత్త లేఅవుట్లు, వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. ఈ ప్రాంతంలో లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టాలంటే హెచ్ఎండీఏ అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ, నగరర శివారు గ్రామాల్లోని వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా, హెచ్ఎండీఏ అనుమతులు తీసుకోకుండానే లేఅవుట్లు చేసి.. ప్లాట్లను విక్రయిస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు డబ్బులకు ఆశపడి వీటిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ దేవానంద్ ఇలాగే చేస్తూ పట్టుబడ్డారు. గతంలోనూ యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీలు, రిజిస్ట్రేషన్లకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఓ ఉద్యోగిపై చర్యలు తీసుకున్నారు. రెండేళ్ల క్రితం కూడా ఏసీబీ దాడులు జరిగాయి. అయినా నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

ఎమ్మెల్యే సుశాంత బోర్గోహైన్ రాజీనామా.. షోకాజ్ నోటీసు ఇచ్చిన కాంగ్రెస్

గౌవహతి, జులై 31:: అస్సాంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే సుశాంత బోర్గోహైన్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి నిన్న రాజీనామా చేశారు. ఈ పరిణామంపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా స్పందించింది. ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో స్పష్టంగా చెప్పాలంటూ ఇవాళ ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూపేశ్ భోరా సుశాంత బోర్గోహైన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అతడిపై న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు భోరా తెలిపారు. సుశాంత బోర్గోహైన్ ఎగువ అస్సాంలోని థౌరా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన కాంగ్రెస్‌ను వీడటం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. సుశాంత రాజీనామాను అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) కార్యాదర్శి అపుర్బ కుమార్ ఈ ఉదయం ఆమోదించిన విషయం తెలిసిందే.

న్యూస్ ఆన్ ఎయిర్ రేడియో లైవ్-స్ట్రీమ్ ఇండియా ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ, జులై 31:న్యూస్ఆన్ ఎయిర్ యాప్ ద్వారా ప్రసారం అవుతున్న ఆకాశవాణి ప్రసారాలు జైపూర్, పాట్నా లలో యువతను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ రెండు నగరాల్లో ఆకాశవాణి ప్రసారాలను వింటున్న వారిలో 60% వరకు 18 నుంచి 45 మధ్య వయసులో ఉన్నవారు ఉన్నారు. న్యూస్ ఆన్ ఎయిర్ ప్రసారాలకు ర్యాంకింగ్ ఇవ్వడానికి జనాభా ఆధారంగా పెద్ద నగరాల్లో నిర్వహించిన అధ్యయనంలో ఈ ఆసక్తికర అంశం వెల్లడయింది.

కాస్మోపాలిటన్ నగరంగా పూణే తనను తాను రుజువు చేసుకుంది. నగరంలో న్యూస్ ఆన్ ఎయిర్ ప్రసారం అవుతున్న ఆకాశవాణి మరాఠీ ప్రసారాలతో పాటు కన్నడ, హిందీ ప్రసారాలకు ఆదరణ లభించింది.

న్యూస్ ఆన్ ఎయిర్ యాప్‌లో ప్రసారం అవుతున్న ఆకాశవాణి రేడియో లైవ్-స్ట్రీమ్‌లు ఎక్కువ ప్రాచుర్యం పొందిన దేశంలోని ప్రధాన నగరాల ర్యాంకింగ్స్‌లో అహ్మదాబాద్ టాప్ 10 లో చోటు దక్కించుకుంది. భోపాల్ తొమ్మిదవ స్థానంతో పాటు టాప్ 10 లో స్థానం కోల్పోయింది.

ప్రసార భారతి అధికార యాప్ అయిన న్యూస్ ఆన్ ఎయిర్ లో ఆకాశవాణి 240 కి పైగా రేడియో కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి. న్యూస్ ఆన్ ఎయిర్ యాప్‌లో ప్రసారం అవుతున్న ఆకాశవాణి ప్రసారాలకు భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 85 కి పైగా దేశాలు, 8000 నగరాల్లో పెద్ద సంఖ్యలో శ్రోతలు ఉన్నారు.

భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో న్యూస్ ఆన్ ఎయిర్ యాప్‌లో ప్రసారం అవుతున్న ఆకాశవాణి రేడియో ప్రసారాలను శ్రోతలు వింటున్నారు. జూలై 1 నుంచి 2021 జూలై 15 వరకు పక్షం రోజుల సమాచారం ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లు ఇవ్వబడ్డాయి.

తెలుగు సినిమా తొలినాళ్లకు చెందిన 450 అరుదైన గ్లాస్ స్లైడ్ల సంపదను సమీకరించిన ఎన్ఎఫ్ఏఐ

న్యూఢిల్లీ, జులై 31: భారత జాతీయ చలనచిత్ర భాండాగారం (ఎన్ఎఫ్ఏఐ) తన చలనచిత్ర నిధికి 450కిపైగా చిత్రాలకు చెందిన అరుదైన స్లైడ్లను కొత్తగా జోడించింది. తొలినాళ్ల సినిమా వీక్షణ అనుభవంలో ఒక సమగ్ర భాగమైన ఈ గ్లాస్ స్లైడ్లు లభ్యం కావడంపై మేమెంతో సంతోషిస్తున్నాం. రెండు నలుచదరపు అడ్డపు పలకల మధ్య అమర్చిన పాజిటివ్ ఫిలిమ్‌తో ఇవి రూపొందించబడ్డాయి. సినిమా ప్రదర్శనకు ముందు లేదా ప్రదర్శన విరామ సమయంలో రాబోయే ఆకర్షణీయ అంశాలను వెల్లడించేందుకు ఈ స్లైడ్లను వినియోగించేవారు. ఈ గ్లాస్ స్లైడ్ల తయారీ కోసం వాడే పాజిటివ్ ఫిల్ములు సంబంధిత సినిమా పోస్టర్లు లేదా దిన, వార పత్రికలలో ప్రచార సరంజామాకు సంబంధించినవి కావడం గమనార్హం. ఈ గ్లాస్ స్లైడ్లు 1930 నుంచి 1950 దశకం మధ్య వరకూగల కాలానికి సంబంధించిన తెలుగు చలనచిత్ర చరిత్రను మనకు ప్రదర్శిస్తాయి. భారతీయ టాకీ సినిమా చరిత్రలో తొలి దశాబ్దాలనాటి తెలుగు సినిమా వైభవం జాడలను ఈ ఫ్రేములు చక్కగా చూపుతాయి.

ఎన్ఎఫ్ఏఐ సేకరించిన గ్లాస్ స్లైడ్లలో సాంఘిక సంస్కరణలకు మార్గనిర్దేశం చేస్తూ వితంతు వివాహాలపై వి.వి.రావు నిర్మించిన 'మళ్లీ పెళ్లి' (1939) వంటి చిత్రంసహా అనేక ముఖ్యమైన చిత్రాలకు చెందిన స్లైడ్లు ఉన్నాయి. అలాగే అదే సంవత్సరంలో చిత్తూరు వి.నాగయ్య నటించగా, బి.ఎన్.రెడ్డి నిర్మించిన 'వందేమాతరం' (1939), అటుపైన అక్కినేని నాగేశ్వర రావు, అంజలీదేవి నాయకానాయికలుగా ఘన విజయం సాధించిన 'కీలుగుర్రం' (1949), మరొక నట దిగ్గజం ఎన్.టి.రామారావు కథానాయకుడుగా విశేష ప్రజాదరణ పొందిన చిత్రం 'దాసి' (1952), విమర్శకుల ప్రశంసలందుకున్న శరత్‌చంద్ర చటోపాధ్యాయ నవల దేవదాస్ ఆధారంగా అక్కినేని నాగేశ్వర రావు, సావిత్రి, లలిత ప్రధాన పాత్రధారులుగా వేదాంతం రాఘవయ్య నిర్మించిన 'దేవదాసు' (1953)సహా అనేక చిత్రాలకు చెందిన స్లైడ్లు ఉన్నాయి. ఈ మేరకు 1939 నుంచి 1955 మధ్యకాలంలో నలుపు-తెలుపులో తీసిన దాదాపు 70 తెలుగు సినిమాలకు చెందిన స్లైడ్లు వీటిలో ఉన్నాయి. గత సంవత్సరం కూడా ఎన్ఎఫ్ఏఐ దాదాపు 400కుపైగా గ్లాస్ స్లైడ్లను సమీకరించింది. తాజాగా సేకరించినవిసహా హిందీ, గుజరాతీ, తెలుగు చలనచిత్రాలకు సంబంధించిన 2000కుపైగా స్లైడ్లు ఎన్ఎఫ్ ఐఏ భాండాగారంలో ఉన్నాయి.

ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఏఐ డైరెక్టర్ ప్రకాష్ మాగ్దం మాట్లాడుతూ- "ఈ గ్లాస్ స్లైడ్లు భారతీయ చలనచిత్ర వారసత్వానికి సంబంధించిన ఎంతో అరుదైన రికార్డులు. వీటిని మా భాండాగారంలో భద్రపరచడం మాకెంతో సంతోషం కలిగిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారిపోతున్న నేపథ్యంలో ఇంతపెద్ద సంఖ్యలో గ్లాస్ స్లైడ్లు లభ్యం కావడం ఎంతో అరుదైన విషయమేగాక విశేష అన్వేషణకూ నిదర్శనం. ఇదే తరహాలో అరుదైన ఫిల్మ్ ఫుటేజీలు, ఫొటోలు, పోస్టర్లు, లాబీ కార్డులు వంటివాటిని పదిలపరచేందుకు వీలుగా మాకు అందజేయాలని చలనచిత్ర ప్రేమికులకు మేం విజ్ఞప్తి చేస్తున్నాం" అన్నారు. ప్రస్తుత అరుదైన సామగ్రి సేకరణ గురించి ఎన్ఎఫ్ఏఐ డాక్యుమెంటేషన్ ఇన్‌చార్జి శ్రీమతి ఆర్తీ కర్ఖానిన్ మాట్లాడుతూ- "తెలుగు సినిమా తొలినాళ్లలో చిత్రాలపై ప్రజల్లో ప్రచారం గురించి ఈ గ్లాస్ స్లైడ్లు సంక్షిప్త సమాచారమిస్తాయి. చలనచిత్ర పరిశోధకులకు ఇవెంతో అమూల్య ఉపకరణాలు కాగలవు. వీటిని త్వరలోనే డిజటలీకరణ చేయబోతున్నాం" అని తెలిపారు.

కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన సమావేశం అయిన జాతీయ ఆరోగ్య కమిషన్ (ఎన్ఎంసీ)

న్యూఢిల్లీ, జులై 31:ఈ రోజు కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జాతీయ ఆరోగ్య కమిషన్ (ఎన్ఎంసీ) సమీక్షా సమావేశం జరిగింది. వైద్య విద్యకు సంబంధించిన పలు అంశాలను సమావేశంలో చర్చకు వచ్చాయి.

ముందు నిర్ణయించిన ప్రకారం 2023 మొదటి భాగంలో రోడ్‌మ్యాప్ ప్రకారం నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (ఇఎలీబి)ను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

విధానాన్ని పరీక్షించడానికి మరియు వైద్య విద్యార్థులలో ఆందోళనను తొలగించడానికి 2022 లో ప్రయోగాత్మకంగా పరీక్షను నిర్వహించాలని నిర్ణయించామని అధికారులు వివరించారు. ఇఎలీ (దశ 1 మరియు 2) ఫలితాలను ప్రవంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఇఎలీ ని ఏ విధంగా నిర్వహించాలి, దీనికోసం ఎటువంటి చర్యలు అమలు చేయాలి అన్న అంశాలపై కూడా సమావేశంలో చర్చలు జరిగాయి. భారతదేశంలో లేదా ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఇఎలీ ఒకే విధంగా ఉంటుంది. విదేశీ వైద్య గ్రాడ్యుయేట్ల (ఎఫ్ఎమ్ జి) / మ్యూచువల్ రికగ్నిషన్ సమస్య దీని ద్వారా పరిష్కారం అవుతుంది.

సమావేశంలో మాట్లాడిన శ్రీ మన్సుఖ్ మాండవీయ వైద్య విద్య నాణ్యతను మెరుగు పరిచి, పారదర్శక పరీక్షా విధాన రూపకల్పన, ఆరోగ్య సేవల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ లక్ష్యాల సాధనకు సంబంధిత వర్గాలతో కలసి పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు.

నాణ్యమైన వైద్య విద్యకు అందరికీ అందుబాటులోకి తెచ్చి దేశంలోని అన్ని ప్రాంతాల్లో వైద్య నిపుణుల సేవలు లభించేలా చేసి దేశంలో అందరికి సమానమైన మరియు సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ అందించాలన్న లక్ష్యంతో పార్లమెంటు ఆమోదం తో 25.9.2020 నుండి అమల్లోకి వచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ యాక్ట్, 2019 ద్వారా ఎన్ఎంసి స్థాపించబడింది.

వైద్య విద్య నాణ్యత, ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన నిబంధనలను, విధానాలను రూపొందించడం, వైద్య సంస్థలు, వైద్య పరిశోధనలు మరియు వైద్య నిపుణులను నియంత్రించే విధానాలను రూపొందించడం, ఆరోగ్యం మరియు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాల కోసం మానవ వనరులతో సహా ఆరోగ్య సంరక్షణలో అవసరాలను అంచనావేసి వీటిని అందుబాటులోకి ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేయడం, కమిషన్, అటానమస్ బోర్డులు మరియు రాష్ట్రాల వైద్య బోర్డులు సక్రమంగా పనిచేయడానికి అవసరమైన నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించి అమలు చేసే అంశాలను నేషనల్ మెడికల్ కమిషన్ పర్యవేక్షిస్తోంది. స్వయంప్రతిపత్త బోర్డుల మధ్య సమన్వయాన్ని సాధించడానికి కూడా నేషనల్ మెడికల్ కమిషన్ కృషి చేస్తుంది.

స్వయంప్రతిపత్త బోర్డులు తీసుకునే నిర్ణయాలపై నిర్ణయాలకు సంబంధించి ఎన్ఎంసి అప్పీలేట్ అధికారంతో పనిచేస్తుంది. వైద్య వృత్తిలో వృత్తిపరమైన నైతిక విలువలను పాటించడం కోసం అవసరమైన విధానాలు నిబంధనలకు రూపకల్పన చేసి వాటిని అమలు చేస్తూ వైద్య నిపుణులు సేవలు అందించే సమయంలో అనుసరించవలసిన నైతిక ప్రవర్తనా నియమావళిని ఎన్ఎంసి అమలు చేస్తుంది.

వరద బాధిత అరుణాచల్‌ప్రదేశ్‌లో యార్లుంగ్-లమాంగ్ రహదారిని పునరుద్ధరించిన బీఆర్‌వో

హైదరాబాద్ , జులై 31: అరుణాచల్ ప్రదేశ్‌లోని షి యోమి జిల్లాలో ఉన్న యార్లుంగ్-లమాంగ్ రహదారిని 'సరిహద్దు రహదారుల సంస్థ' (బీఆర్‌వో) పునరుద్ధరించింది. ఈ నెల 26, 27 తేదీల్లో కురిసిన కుంభవృష్టి కారణంగా ఈ రహదారి అనేకచోట్ల కొట్టుకుపోయింది.

ప్రాజెక్ట్ బ్రహ్మోక్‌కు చెందిన ఇంజినీర్ టాస్క్‌ఫోర్స్ అండ్ క్విక్ రెస్పాన్స్ బృందాన్ని బీఆర్‌వో సహాయ చర్యల కోసం పంపింది. నైపుణ్యంగల సిబ్బందితోపాటు, జేసీబీ, డోజర్లు, ఎక్స్‌కావేటర్లు ఈ బృందంలో ఉన్నాయి. కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ, యాభై మంది బీఆర్‌వో సిబ్బంది రాత్రింబవళ్లూ పునరుద్ధరణ పనులు కొనసాగిస్తున్నారు.

ప్రజలు నడిచి వెళ్లేందుకు, సాయుధ దళాల సిబ్బందికి రవాణా కోసం ఈ నెల 27న రహదారిని కొంతవరకు పునరుద్ధరించగలిగారు. దీనివల్ల, ఎగువనున్న ప్రాంతాల్లోని సైనిక సిబ్బందికి నిత్యావసరాలు, వైద్య సదుపాయాల వంటి అత్యవసర సేవలు అందుతున్నాయి. తేలికపాటి వాహనాలు వెళ్లేలా 28వ తేదీ నాటికి రహదారిని పునరుద్ధరించారు. ఆగస్టు 3వ తేదీ నాటికి సంపూర్ణ పునరుద్ధరణ జరిగేలా బీఆర్‌వో తన వనరులను మోహరించింది. బ్రహ్మోక్ ప్రాజెక్టులో భాగమైన రహదారిని ఈ ఏడాది జూన్ 17న ప్రారంభించారు. వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఈ రహదారి, ఎగువ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సాయుధ దళాలకు, చుట్టుపక్కల గ్రామాలకు కీలకమైనది.

జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు

అమరావతి, జులై 31:ఏపీలో టీడీపీ నేతలే టార్గెట్ గా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలో విపిస్తున్నాయి. ఇటీవల కొండపల్లిలో అక్రమ మైనింగ్ పరిశీలించేందుకు వెళ్లిన మాజీ మంత్రి దేవినేని ఉమపై పలు సెక్షన్ ల కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరో టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ ఐపీసీ 153o, 506 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదైంది.

కాగా, శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగిన తాడిపత్రి మున్సిపల్ రెండవ వైస్ చైర్మన్ ఎన్నికలో టీడీపీ మద్దతు ఇచ్చిన అబ్దుల్‌రహీం విజయం సాధించారు. ఆ తర్వాత జేసీ ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజకీయం ఏమిటో ఇక నుంచి తాను చూపిస్తానంటూ వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని హెచ్చరిస్తూ మీసం మెలేశారు. టీడీపీ మద్దతు ఇచ్చిన ఇండిపెండెంట్ కౌన్సిలర్.. వైస్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకొని తన సత్తా ఏమిటో పెద్దారెడ్డికి మరోసారి నిరూపించానని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో తాను గానీ, కొడుకు, భార్య గానీ తమ తడాఖా ఏమిటో జేసీ సోదరులకు చూపిస్తామని ప్రగల్భాలు పలికిన పెద్దారెడ్డి చివరికి బొక్కబోర్లా పడ్డారని విమర్శించారు.

కాళేశ్వరం బాధితులకు నష్టపరిహారం ఏది?: కోదండరాం

హైదరాబాద్ , జులై 31:కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ప్రవాహంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం, నీటి నిర్వహణ పద్ధతుల్లో లోపాల కారణంగా ప్రతి ఏటా రైతుల పంట కోతకు గురువుతోందని తెలిపారు. మూడేళ్ళల్లో 7 వేల ఎవరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని చెప్పారు. నీటి నిర్వహణలో సమూలంగా మార్పులు చేయాలని సూచించారు. రైతులు పంట నష్టపోకుండా ప్రభుత్వమే శాశ్వత పరిష్కారం చూపాలని కోందరాం డిమాండ్ చేశారు.

వక్ఫ్ భూములు కాపాడాలంటూ ఆర్డీవోకు వినతి.

రాజన్న సిరిసిల్ల, జులై 31:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో గల సర్వే నంబర్ 41,42,43 వక్ఫ్ బోర్డుకు చెందిన వక్ఫ్ భూములలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వీటిని కాపాడాలంటూ వేములవాడకు చెందిన ముస్లింలు శనివారం సిరిసిల్లలో రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్ కు కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో చాలా వరకు వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు అన్యాక్రాంతమై ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించాలని ఆర్డీవోకు విన్నవించుకున్నారు.. ఇప్పటికైనా సర్వే నంబర్లు 41,42,43 గల భూములను గుర్తించి వాటికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరారు.

దీనికి స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ పరిధిలో వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన భూములను సర్వే చేసి వాటిని రక్షించేందుకు ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సంబంధిత వేములవాడ అర్బన్ తహశీల్దారుకు, మున్సిపల్ కమిషనర్ వేములవాడకు వక్ఫ్ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను నివరించారని ఆదేశించారు.

'ఇంద్ర నేవి-21' విన్యాసాల్లో పాల్గొన్న ఐఎన్ఎస్ తబర్

న్యూఢిల్లీ, జులై 31:భారత్, రష్యా నౌకాదళాల "ఇంద్ర నేవీ" 12వ ఎడిషన్ సముద్ర విన్యాసాలను ఈ నెల 28-29 తేదీల్లో బాల్టిక్ సముద్రంలో నిర్వహించారు. 2003లో ఇంద్ర నేవీప్రారంభమైంది. ఈ విన్యాసాలు రెండు నౌకాదళాల దీర్ఘకాలిక వ్యూహాత్మక బంధానికి నిదర్శనం. రష్యా నౌకాదళ 325వ నౌకాదళ దినోత్సవంలో పాల్గొనడానికి రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ వెళ్లిన ఐఎన్ఎస్ తబర్, అక్కడ ఈ విన్యాసాల్లో భాగస్వామిగా మారింది.

'ఇంద్ర నేవి' విన్యాసాల పరిధి, సంక్లిష్టత, స్థాయి ఏటికేడు పెరుగుతూనే ఉంది. ఏళ్లుగా రెండు నౌకాదళాలు నిర్మించుకుంటూ వస్తున్న సహకారాన్ని మరింత ఏకీకృతం చేయడం, బహుముఖ సముద్ర కార్యకలాపాల అవగాహన, విధానాలను మెరుగుపరచడం ఈ సంవత్సర విన్యాసాల ప్రాథమిక లక్ష్యం. సముద్ర కార్యకలాపాలకు సంబంధించి విస్తృత పరిధి, విభిన్నత ఈ ఎడిషన్‌లో ఉన్నాయి.

భారత్ తరపున స్టెల్త్ సాంకేతికత ఉన్న ఐఎన్ఎస్ తబర్ పాల్గొనగా, రష్యా తరపున ఆర్ఎఫ్ఎస్ జెల్యోని డోల్, ఆర్ఎఫ్ఎస్ ఒడింట్సోవో ప్రాతినిధ్యం వహించాయి.

రెండు రోజుల పాటు జరిగిన 'ఇంద్ర నేవీ-21'లో యాంటీ ఎయిర్ ఫైరింగ్, అండర్‌వే రీప్లేస్‌మెంట్ డ్రిల్స్, హెలికాప్టర్ ఆపరేషన్ల వంటి వివిధ విన్యాసాలను ప్రదర్శించారు.

కరోనా అవరోధాలను అధిగమించి 'ఇంద్ర నేవీ-21' నిర్వహించారు. రెండు నౌకాదళాల మధ్య విశ్వాసం, సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు, ఉత్తమ విధానాలను పంచుకునేందుకు ఈ విన్యాసాలు వీలు కల్పించాయి. రెండు నౌకాదళాల మధ్య సహకారం, దీర్ఘకాలిత స్నేహ బంధాన్ని సుదృఢం చేయడానికి ఈ విన్యాసాలు మరొక మైలురాయిగా నిలుస్తాయి.

సిబిఎస్ఇ పరీక్షలలో విజయవంతంగా ఉత్తీర్ణులైనపన్నెండో తరగతి విద్యార్థులను అభినందించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 31:సిబిఎస్ఇ పరీక్షల లో కృతార్థులైన పన్నెండో తరగతి విద్యార్థుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందన లు తెలిపారు. వారి ని యువ మిత్రులు అంటూ ఆయన సంబోధించారు; వారికి ఒక ఉన్నతమైనటువంటి, సంతోషదాయకమైనటువంటి, ఆరోగ్యకరమైనటువంటి భవిష్యత్తు లభించాలి అని ప్రధాన మంత్రి ఆకాంక్షించారు.

" చీఎవ తరగతి సిబిఎస్ఇ పరీక్షల లో విజయవంతం గా ఉత్తీర్ణత ను సాధించిన నా యువ మిత్రుల కు అభినందనలు. వారికి ఒక ఉజ్వలమైన, సంతోషదాయకమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కై ఇవే శుభాకాంక్ష లు.

మరింత కఠోర కృషి ని చేసి ఉండవలసిందని గాని లేదా మరింత ఉత్తమమైనటువంటి ప్రదర్శన ను కనబరచి ఉండవలసిందని గాని భావించే వారికి నేను ఒకటి చెప్పదలచుకొన్నాను.. మీ అనుభవం లో నుంచి నేర్చుకోండి, మరి మీ శిరస్సు ను ఉన్నతం గా ఉంచుకోండి. ఒక ప్రకాశవంతమైనటువంటి, అవకాశాల తో నిండి ఉన్నటువంటి భవిష్యత్తు మీ కోసం వేచి ఉంది. మీలో ప్రతి ఒక్కరి లోనూ ప్రతిభ కు కొదువ లేదు. నా శుభాకాంక్షలు మీకు ఎప్పుడూ ఉంటాయి.

ఈ సంవత్సరం పన్నెండో తరగతి బోర్డుల కు హాజరు అయిన బ్యాచ్ ఇది వరకు ఎరుగని పరిస్థితులలో ఆ పని ని చేసింది.

గడచిన సంవత్సరం లో విద్య జగతి ఎన్నో మార్పుల ను చూసింది. అయినప్పటికి కూడా, వారు కొత్త సాధారణ స్థితి కి అలవాటు పడ్డారు, వారు వారి అత్యుత్తమ ప్రతిభ ను ప్రదర్శించారు. వారిని చూసి గర్వపడుతున్నాను " అని ప్రధాన మంత్రి అనేక ట్వీట్ లలో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే హుజురాబాద్ బరిలో నిలుస్తాం

రాజన్న సిరిసిల్ల, జులై 31:(నేటినిజం ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వరి జలాశయం (మిడ్ మానేర్) ముంపు గ్రామాల ప్రజల పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే హుజురాబాద్ ఉప ఎన్నికల్లో గ్రామానికి పది మంది చొప్పున 120 మంది అభ్యర్థులను బరిలో నిలుపుతామని ముంపు గ్రామాల ఐక్యవేదిక అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు . పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మిడ్ మానేర్ నిర్వాసితుల ఆధ్వర్యంలో కోదురుపాక నుండి సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి శనివారంతో రెండు సంవత్సరములు పూర్తయిన సందర్భంగా తమ సమస్యలు ఇప్పటికైన పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముంపు గ్రామాల ఐక్యవేదిక అఖిలపక్షం ఆధ్వర్యంలో వేములవాడ సిరిసిల్ల ప్రధాన రహదారిలోని నంది కమాను వద్ద నల్ల బెలూన్లు ఎగరవేసి నిరసన కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజల న్యాయమైన డిమాండ్ నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ , మంత్రి కేటీఆర్ , స్థానిక ఎమ్మెల్యే లు విఫలమయ్యారని పేర్కొంటూ 2019 జులై 31 న పదివేల మంది మిడ్ మానేరు నిర్వాసితులందరం కలసి మహాపాదయాత్ర చేశామని , పాదయాత్ర చేసి ఇప్పటికి రెండు సంవత్సరాలు గడుస్తున్నా సీఎం ఇచ్చిన హామీ 5 లక్షల 4 వేల రూపాయలు ఇవ్వడం లేదని , జులై 4 న సీఎం కేసీఆర్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లోని ఆడపిల్లకు రెండు లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించి ఇంతవరకు ఇవ్వలేదని , వీటితో పాటు ఇంకా చాలా సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని , ఇప్పటికైనా పెండింగ్ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలని , లేనియెడల త్వరలో జరగబోయే హుజురాబాద్ ఎన్నికల్లో ముంపు గ్రామాల తరపున బరిలో నిలిచి టీఆరెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు కు?స రవీందర్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ పె ల్లి కనకయ్య ,సర్పంచ్ లు పండుగ ప్రదీప్ , కదిరిరాజు , గాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్ బాస రాజశేఖర్, అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు

అమ్మవారి దయతో ప్రజలంతా చల్లగా ఉండాలి : ఎమ్మెల్యే చందర్

కరీంనగర్, జులై 31:అమ్మవారి దయతో ప్రజలంతా చల్లగా ఉండాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆకాంక్షించారు. శనివారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో ఆషాఢ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొని స్థానికులతో కలిసి బోనంతో ఊరేగింపుగా శివశిత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు రజిత రవీందర్, బాలరాజ్ కుమార్, సురేష్ భవాని, ఇరుగురాళ్ల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధులో ఏంటీ దగా?

హైదరాబాద్ , జులై 31:హుజూరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమయ్యే దళితబంధులో సీఎం కేసీఆర్ ద్వంద్వ నీతినే పాటిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. దళిత బంధుతో హుజురాబాద్ లో దళితులపై ఓట్ల వల విసిరిన సీఎం.. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది దళిత విద్యార్థులు విలవిలలాడిపోతున్నా పట్టించుకోవడం లేదు. దళిత బంధు పైలట్ ప్రాజెక్టు కోసం అవసరమైతే 3 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడతానని ప్రకటించిన కేసీఆర్.. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా అదే దళిత విద్యార్థుల ఉసురుపోసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిధుల కొరత కారణంతో రాష్ట్రంలో ఉన్నత, వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న 12.5 లక్షల మంది విద్యార్థులకు రెండేళ్లుగా ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందులోనూ లక్షలాది మంది దళిత విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో.. పరీక్షలు రాసేందుకు అనుమతి లేక ఇప్పటికే అనే మంది విద్యార్థిలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇటీవల వనపర్తి జిల్లాకు చెందిన విద్యార్థి లావణ్య కూడా ఫీజు చెల్లించలేకపోయానన్న కారణంతో ప్రాణాలు తీసుకుంది. అయితే, ప్రభుత్వానికి మాత్రం ఆ దళిత విద్యార్థిని చావు కనిపించలేదు. లక్షలాది దళిత విద్యార్థుల భవిష్యత్తులో కోసం బకాయిలు చెల్లించేందుకు ముందుకు రాని సర్కార్.. హుజురాబాద్‌లో మాత్రం ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టేందుకైనా చేతులు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ప్రతి సంవత్సరం సగటున 5.45 లక్షల కొత్త విద్యార్థులు, అలాగే 7.99 లక్షల మంది పాత విద్యార్థులు రీఎంబర్స్‌మెంట్ స్కీమ్‌ను క్లెయిమ్ చేస్తున్నారు. అలా వారి కోసం ఏటా ప్రభుత్వం రూ .2,300 కోట్లు విడుదల చేయాలి. కానీ ప్రభుత్వం 2019-20 విద్యా సంవత్సరానికి కేవలం రూ .784 కోట్లు మాత్రమే కాలేజీలకు ఇచ్చింది. 2020-21 సంవత్సరానికి సంబంధించి అయితే ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. 2021-22 విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ, గత రెండేళ్లకు సంబంధించిన 3,216 కోట్ల రూపాయల బకాయిలే అందలేదు.

ఇప్పటివరకు ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ కింద రూ.3,816 కోట్ల బకాయిలను కాలేజీలకు చెల్లించాల్సి ఉంది. అయితే, వీటిని క్లియర్ చేయడానికి రెండేళ్లుగా ప్రభుత్వం దగ్గర డబ్బు లేదు కానీ.. అంతే మొత్తంలో హుజురాబాద్‌లో దళిత బంధు కోసం డబ్బు ఖర్చు పెట్టేందుకు మాత్రం ఖజానాలో సొమ్ములు ఎలా కనిపించాయి? అనేది ప్రశ్న. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో.. అనేక చోట్ల కళాశాల యాజమాన్యాల విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నాయి. కొన్ని చోట్ల పరీక్షలకు హాజరుకానివ్వకపోగా.. మరికొన్న చోట్ల కోర్సు పూర్తయినా.. ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

ఈటలది డ్రామానా? కౌశిక్ ఓవర్ యాక్షనా?!

హైదరాబాద్ , జులై 31:హుజురాబాద్ లో ఎన్నికల హడావిడి కనిపిస్తోంది. ఉప ఎన్నిక టీఆర్ఎస్, బీజేపీ పార్టీలను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గెలుపు కోసం బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పాదయాత్ర మొదలు పెడితే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియోజవకర్గ అభివృద్ధి, దళిత బంధు అంటూ కోట్లు కుమ్మరిస్తున్నాయి. టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరు ఉంటారు అనేదానిపై ఇంకా స్పష్టత రాకపోయినా? ఈటలపై మాటల దాడికి మాత్రం కొనసాగిస్తున్నారు.

ప్రజా దీవేన యాత్ర మొదలు పెట్టిన ఈటల నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. గత 12 రోజులుగా దాదాపు 222 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఈ క్రమంలో స్వల్ప అస్వస్థతకు గురి కావడంతో డాక్టర్ల సలహా మేరకు పాదయాత్రకు బ్రేక్ ఇచ్చారు. అయితే, ఇదంతా ఓ పెద్ద డ్రామా అని టీఆర్ఎస్ విమర్శలు మొదలు పెట్టింది. దిగజారుడు రాజకీయాలకు ప్రతీక బీజేపీ, దగా కోరు రాజకీయాలకు నిలువుటద్దం ఈటల రాజేందర్ అంటూ టీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.'' ఈ దిగజారుడు పార్టీ,దగాకోరు రాజేందర్ ల ఆధ్వర్యంలో మొదలయిన ఇలాంటి డ్రామాలు, నాటకాలు హుజురాబాద్ ప్రజలు ఇంకెన్ని చూడాల్సి ఉందో? ఈటల రాజేందర్ త్వరగా కోలుకోవాలి '' అని కౌశిక్ వ్యాఖ్యానించారు.

హుజురాబాద్ ఉప ఎన్నికల బరిలో ఈటలకు ప్రత్యర్థిగా టీఆర్ఎస్ తరపున పాడి కౌశిక్ రెడ్డి దిగబోతున్నారని ప్రచారం జరుగుతోంది. కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ లో ఉండగా? టీఆర్ఎస్ టికెట్ తనకే అంటూ మాట్లాడిన ఆడియో వైరల్ అవ్వడం అందరికీ తెలిసిందే. అనంతరం జరిగిన పరిణామాలతో ఆయన కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. టికెట్ ఆయనకే ఖరారు చేశారా? అన్నది క్లారిటీ లేదు. అయితే, ఈటల పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో టీఆర్ఎస్ అలర్ట్ అయ్యింది.

ఈ క్రమంలో ఈటల బావమరిది వాట్సాప్ చాట్ బహిర్గతం అయ్యాయి. అయితే, దీనిని ఈటల వర్గం గట్టిగానే కౌంటర్ ఇచ్చింది. తాజాగా ఈటల పాదయాత్రకు బ్రేక్ పడడంతో టీఆర్ఎస్ దీనిని విమర్శనాస్త్రంగా ఎంచుకుంది. దళిత బందు ఓ ఎన్నికల స్టంట్ అంటూ బీజేపీ? ఈటల దళిత వ్యతిరేకి అంటూ టీఆర్ఎస్.. ఒకరిపై మరొకరు ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

రామప్ప దేవాలయం సమగ్ర నివేదికపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమీక్ష

హైదరాబాద్ , జులై 31: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గల తన కార్యాలయంలో యూనెస్కో గుర్తించిన ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయంపై ఆర్కియాలజీకల్ సర్వే ఆఫ్ ఇండియా, హెరిటేజ్ తెలంగాణ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రామప్ప దేవాలయంను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించినందుకు హెరిటేజ్ తెలంగాణ శాఖ తరపున, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పక్షాన మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

రామప్ప దేవాలయంపై యునెస్కో సూచించిన మార్గదర్శకాలపై డిసెంబర్ 2022 లో సమర్పించాల్సిన సమగ్ర నివేదికపై మంత్రి చర్చించి పలు సూచనలను, సలహాలను చేశారు. కాకతీయుల కాలంనాటి అద్భుతమైన కళాసంపదను, తెలంగాణ సంస్కృతిని యూనెస్కో సంస్థ గుర్తించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేల ఏళ్ల నాటి చారిత్రాత్మక సంపద, ఎన్నో అత్యద్భుతమైన ప్రదేశాలున్నాయన్నారు. రామప్ప దేవాలయంను యూనెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తిస్తూ కొన్ని సూచనలు చేసిందన్నారు. యూనెస్కోకు సమర్పించిన ఆూూఎఇఖీ లో పొందుపరిచిన సమాచారానికి లోబడి ఉండాలన్నారు.

కాకతీయుల కాలంలో నిర్మించిన రామప్ప దేవాలయం సమీపంలో వున్న చారిత్రాత్మక కట్టడాలు, దేవాలయాలను సంరక్షించి, కాకతీయ హెరిటేజ్ సర్క్యూట్ గా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలంగాణ హెరిటేజ్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రామప్ప దేవాలయంలో కేంద్ర ఆర్కియాలజీ శాఖకు చెందిన స్థలం వాటి సరిహద్దులు గుర్తించాలన్నారు. తెలంగాణ హెరిటేజ్ శాఖ అధీనంలో ఉన్న స్థలం అభివృద్ధి చేసేందుకు, తీసుకునే చర్యలపై మంత్రి చర్చించి పలు సూచనలు, సలహాలు చేయడం జరిగింది. రామప్ప దేవాలయం చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న దేవాలయాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ స్మిత ఎస్. కుమార్, వైఏటీఎస్ జాయింట్ సెక్రటరీ కె. రమేష్, హెరిటేజ్ తెలంగాణ ఉన్నతాధికారులు నారాయణ, రాములు నాయక్, నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

కార్ నికోబార్ నుంచి చేపల వేట పడవను రక్షించిన ఐఎన్ఎస్ ఐరావత్



న్యూఢిల్లీ, జులై 31:అండమాన్, నికోబార్ దీవుల సముదాయంలోని కార్ నికోబార్ వద్ద సముద్ర జలాల్లో ఆగిపోయిన చేపల వేట పడవ సలేత్ మాథా-ఎఎ నుంచి, ఈ నెల 30న రాత్రి 11 గంటలకు సహాయ సందేశాన్ని ఐఎన్ఎన్ ఐరావత్ అందుకుంది. ఆపరేషన్ సముద్రసేతు-ఎఎలో భాగంగా, ఇండోనేషియాలోని జకార్తాకు కొవిడ్ ఉపశమన సామగ్రి అందించి, తిరిగి వస్తూ ఈ ప్రాంతానికి చేరుకున్నప్పుడు ఐఎన్ఎస్ ఐరావత్‌కు సందేశం అందింది. వెంటనే సాయం అందించేందుకు గరిష్ట వేగంతో చేపల వేట పడవ వద్దకు చేరుకుంది. పోర్టుబ్లెయిర్‌కు చెందిన ఆ చేపల వేట పడవ పొడవు 20 మీటర్లు. ఏడుగురు సిబ్బంది ఉన్నారు. 29వ తేదీన ఉదయం నుంచి గేర్ బాక్స్‌లో లోపం కారణంగా ఆ పడవ అక్కడే ఆగిపోయింది. అప్పటి నుంచి సహాయాన్ని అర్థిస్తూ సందేశాలు పంపుతున్నారు. ఆ ప్రాంతంలో 25 నాట్లకుపైగా వేగంతో గాలులు వీస్తున్నాయి. మూడున్నర మీటర్ల ఎత్తుతో కెరటాలు విరుచుకుపడుతున్నాయి. చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల కారణంగా అప్పుడప్పుడు వర్షాలు కూడా పడుతుండడంతో ఐఎన్ఎస్ ఐరావత్‌తో ఆ పడవ అనుసంధాన ఏర్పాట్లు చాలా కష్టమయ్యాయి. తదుపరి సహాయం కోసం ఐఎన్ఎస్ ఐరావత్ ఆ చేపల పడవను నౌకాశ్రయానికి తీసుకెళుతోంది.

ఏపీలో కొత్తగా 2,058 కరోనా కేసులు, 23 మరణాలు

అమరావతి, జులై 31: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి ఉధృతి కొనసాగుతూనే ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా 2,058 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడిన వారిలో 2,053 మంది చికిత్సకు కోలుకున్నారు. తీవ్ర ఇన్ఫెక్షన్ కారణంగా మరో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో మొత్తం పాజిటివ్ కేసులు 19,66,175కు పెరిగాయి. ఇవాళ్టివరకు మొత్తం 16,31,618 మంది కోలుకున్నారు. మరో 21,180 యాక్టివ్ కేసులున్నాయి. మొత్తం మరణాలు 13,377కు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ 78,992 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేసినట్లు ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

బోర్డుల పరిధిలో కార్యాచరణకు సై.. రెండు రాష్ట్రాలతో చర్చ

హైదరాబాద్ , జులై 31:బోర్డుల పరిధిలో కార్యాచరణకు సై.. రెండు రాష్ట్రాలతో చర్చకేంద్ర గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులను తమ ఆధీనంలోకి తెచ్చుకొనే ప్రక్రియకు బోర్డులు శ్రీకారం చుట్టాయి. నోటిఫికేషన్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి కార్యాచరణకు నడుం బిగించాయి. బోర్డు పరిధిలో ఉండే ప్రాజెక్టుల సిబ్బంది, కార్యాలయాలు, వాహనాలు, పరికరాలు మొదలైనవన్నీ తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం, ప్రాజెక్టుల వద్ద అవసరాన్ని బట్టి కేంద్ర పోలీసు బలగాలను నియమించడం, సీడ్ మనీ కింద ఒక్కో రాష్ట్రం రూ.200 కోట్ల వంతున చెల్లించడం తదితర అంశాలన్నింటిపై రెండు రాష్ట్రాలతోనూ బోర్డులు చర్చించనున్నాయి. గతంలో బోర్డు కమిటీల్లో ఉన్నవారినే కాక జెన్‌కో, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, నీటిపారుదల శాఖలోని పరిపాలనా విభాగం అధికారులను కూడా కలిపి ప్రత్యేకంగా సమన్వయ కమిటీని ఏర్పాటుచేశాయి. అనుభవమున్న ఓ చీఫ్ ఇంజినీర్‌ను, సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను సమన్వయం కోసం పంపాలని కృష్ణా బోర్డు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులను కోరింది. గోదావరి బోర్డు ఒకడుగు ముందుకేసి ఆగస్టు మూడో తేదీన సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో బోర్డులోని అధికారులతో పాటు కేంద్ర జల్‌శక్తి అధికారి, రెండు రాష్ట్రాల నీటిపారుదల, పరిపాలనా విభాగాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు, ఏపీ జెన్కో ఎండీ, ట్రాన్స్‌కో సీఎండీ, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీలను ఆహ్వానించారు.

కేంద్ర గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రాజెక్టులను మూడు విభాగాలుగా విభజించారు. బోర్డు పరిధిలోకి వచ్చే ప్రాజెక్టులు, బోర్డు ఆధీనంలో ఉండేవి, రాష్ట్రాల నిర్వహణలో ఉండే కేవలం పర్యవేక్షణ మాత్రమే బోర్డుకు ఉండేవి. ఇందులో బోర్డు ఆధీనంలో ఉండే ప్రాజెక్టుల గురించి ఆగస్టు మూడున జరిగే భేటీలో గోదావరి బోర్డు చర్చించనుంది. శ్రీరామసాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి, పంపుహౌస్, తుపాకులగూడెం, దేవాదుల, సీతారామ, పోలవరం, ధవళేశ్వరం, తాడిపూడి, పుష్కరం, చింతలపూడి, సీలేరు జలవిద్యుత్తు ప్రాజెక్టు మొదలైనవన్నీ గోదావరి బోర్డు పరిధిలో ఉన్నాయి. వాటి వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలను నియమించడం, ప్రాజెక్టులు, నిర్వహణకు సంబంధించి కోర్టుల్లో కేసులు వస్తే అందుకయ్యే వ్యయాన్ని రాష్ట్రాలే భరించడం, ప్రాజెక్టుల్లో మంజూరుచేసిన సిబ్బంది, పనిచేస్తున్న సిబ్బంది, యంత్రాలు, ఆఫీసు కార్యాలయాలు, ఫర్నిచర్, వాహనాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, రికార్డులు, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు లేకుండా నిర్మిస్తోన్న ప్రాజెక్టులకు ఆరునెలల్లో అనుమతులు పొందడం, అనుమతులు రాని ప్రాజెక్టులను నిలిపివేయడం ఇలా అన్ని అంశాలను మూడో తేదీ సమావేశానికి అజెండాగా గోదావరి బోర్డు నిర్ణయించింది. కృష్ణాబోర్డు సైతం త్వరలోనే సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

సీఎం కేసీఆర్ కృషి వల్లే రామప్పకు యునెస్కో గుర్తింపు : టాక్ అధ్యక్షుడు

వరంగల్,జులై 31:తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్లే రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందని తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల పేర్కొన్నారు. రామప్పను ఇవాళ రత్నాకర్ కడుదుల, వారి బృందం సందర్శించారు.

ఈ సందర్భంగా రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ.. రామప్పకు యునెస్కో గుర్తింపునకు కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రామప్పకు యునెస్కో గుర్తింపు లభించడంతో.. ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు.

టాక్ ఉపాధ్యక్షుడు సత్యమూర్తి చిలుముల మాట్లాడుతూ.. రామప్పను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్ని విశ్వవ్యాప్తం చేస్తున్నామని తెలిపారు. రామప్ప ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పేలా కృషి చేస్తామన్నారు.

టాక్ సంయుక్త కార్యదర్శి సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించబడిన రామప్ప ఆలయం భావి తరాలకు గుర్తుండి పోతుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక సంపదను రాబోయే తరాలకు అందించడానికి ఎంతో సహాయ పడుతుందన్నారు.

రామప్పను సందర్శించిన వారిలో టాక్ వ్యవస్థాపకులు, ఎన్నారై టీఆర్ఎస్ అనిల్ కూర్మాచలం, ఎన్నారై టీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, టాక్ సంయుక్త కార్యదర్శి సతీష్ రెడ్డి గొట్టెముక్కల, ఎన్నారై టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్ కుమార్ శానబోయిన, మల్లేష్ పప్పుల, శ్రీనివాస్ వల్లాల, స్థానిక సర్పంచ్ రజిత శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు తిరుమందాస్ నరేష్ గౌడ్, రవి కుమార్ తదితరులు ఉన్నారు.

హుజురాబాద్‌లో టీఆర్ఎస్ కే ఓటు.. దళితులతో ప్రమాణం చేయించిన నేతలు

హైదరాబాద్ , జులై 31:హుజూరాబాద్ నియోజకవర్గంలో ఓట్ల కోసం అధికార టీఆర్ఎస్ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తోంది. దళితుల ఓట్ల కోసం కుటిల ప్రయత్నాలు చేస్తోంది. ఏకంగా టీఆర్ఎస్ కు ఓటు వేయాలని కొన్ని దళిత కుటుంబాలతో అధికార పార్టీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కమలాపూర్ మండలం గూడూరులో మాల సామాజిక వర్గానికి చెందిన వారితో ప్రమాణం చేయించారు. టీఆర్ఎస్ కే ఓటు వేయాలని చేతులు చాచి మరీ శపథం చేయించారు. అంతేకాదు కేసీఆర్ తెలంగాణ జాతిపిత అని వారినోట పలికించారు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే విధంగా టీఆర్ఎస్ నాయకులు ప్రతిజ్ఞలు చేయిస్తున

మాతృభాష పరిరక్షణ కోసం సృజనాత్మక విధానాల మీద దృష్టి పెట్టాలి - ఉపరాష్ట్రపతి

-"తెలుగు కూటమి"భాషాభిమానుల అంతర్జాల సదస్సులో ప్రసగించిన ఉపరాష్ట్రపతి

హైదరాబాద్ , జులై 31:మాతృభాషలను కాపాడుకునేందుకు సృజనాత్మక విధానాల మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు.ఎంత సృజనాత్మకంగా మనం భాషను ముందుకు తీసుకువెళతామో, అంతే వేగంగా ముందు తరాలు భాష వైపు ఆకర్షితమౌతాయని తెలిపారు. ప్రభుత్వాలు భాషను కాపాడాలని సంకల్పిస్తే నిధులు ఇవ్వగలదని, అదే సంకల్పం ప్రజలు తీసుకున్నప్పుడే తరతరాలకు మనగలదని దిశానిర్దేశం చేశారు.

"తెలుగు కూటమి" సంస్థ నిర్వహించిన భాషాభిమానుల అంతర్జాల సదస్సులో ప్రసంగించిన ఉపరాష్ట్రపతి, మాతృభాషను కాపాడుకునేందుకు ఐదు సూత్రాలను పునరుద్ఘాటించారు. ప్రాథమిక విద్య మాతృభాషలో అందేలా చూడడం, పరిపాలనా భాషగా మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వడం, న్యాయస్థాన కార్యకలాపాలు, తీర్పులు మాతృభాషలో అందించడం, క్రమంగా సాంకేతిక విద్యలో మాతృభాషల వినియోగం పెరగడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళలో కుటుంబ సభ్యులతో తెలుగులోనే మాట్లాడాలని సూచించారు.

ఇటీవల సుప్రీం కోర్టులో ఆంగ్లంలో తన సమస్యను చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న మహిళకు మాతృభాష అయిన తెలుగులో మాట్లాడే అవకాశం ఇచ్చి, 21 సంవత్సరాలుగా సాగుతున్న భార్యాభర్తల వివాదాన్ని సానుకూల మార్గంలో పరిష్కరించిన చీఫ్ జస్టిస్ శ్రీ ఎన్.వి.రమణ గారి చొరవను ఉపరాష్ట్రపతి అభినందించారు. సరైన న్యాయం అందాలంటే ప్రజలు తమ సమస్యలను తమ మాతృభాషలో తెలియజేసే అవకాశాన్ని ఇవ్వాలని ఈ సందర్భం ద్వారా రుజువైందని తెలిపారు.

మాతృభాషను కోల్పోతే గుర్తింపును, గౌరవాన్ని కోల్పోతామన్న ఉపరాష్ట్రపతి, మాతృభాషను కాపాడుకునే సంకల్పంతో వివిధ నేపథ్యాలకు చెందిన వారంతా తెలుగు కూటమి సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. తెలుగు భాష పరిరక్షణ ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాలన్న తన ఆకాంక్ష వెనుక ప్రధాన కారణం ఇదేనన్న ఆయన, ప్రభుత్వాలు తమ కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉంటాయని, అయితే ప్రజలంతా కలిసి తమ భాషను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పుడు ముందు తరాలకు అందజేయడం సాధ్యమౌతుందని తెలిపారు. మన సాంస్కృతిక వైవిధ్యాలు, సంప్రదాయాలు, కళలు, సంగీతం, నాట్యం, ఆచారాలు, పండుగలు, సంప్రదాయ విజ్ఞానం, వృత్తుల వారసత్వం లాంటి వాటిని మాతృభాషను కాపాడుకోవడం ద్వారానే పరిరక్షించుకోవచ్చన్న ఉపరాష్ట్రపతి, భాషంటే ఘనమైన వారసత్వమని తెలిపారు.

ఒక పటిష్టమైన భాషా విధానం ఉంటే ఏ భాషనైనా మనం కాపాడుకోవచ్చన్న యునెస్కో తీర్మానాన్ని ఉటంకించిన ఉపరాష్ట్రపతి, దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన భాషా విధానాన్ని ప్రకటించడంతో పాటు, ఆచరించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన విద్యావిధానంలో మాతృభాషకు పెద్దపీట వేసిన కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించిన ఉపరాష్ట్రపతి, అభ్యాసంతో సంస్కృతి, భాష, సంప్రదాయాలను సమీకృతం చేసినప్పుడే పిల్లలు సమగ్రమైన పద్ధతిలో విద్యను అభ్యసించగలరని, నూతన విద్యా విధానం దీనికి పూర్తి ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. ఇటీవల నూతన విద్యాసంవత్సరం నుంచి ఎంపిక చేసిన శాఖల్లో పలు భారతీయ భాషల్లో కోర్సులు అందించాలని 8 రాష్ట్రాల్లోని 14 ఇంజనీరింగ్ కళాశాలలు తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించిన ఆయన, వారికి అభినందనలు తెలిపారు.అంతరించిపోతున్న భాషల పరిరక్షణ మరియు ప్రోత్సాహ పథకం (ుాఖఖఇఒ) ద్వారా మన మాతృభాషల పరిరక్షణ కోసం కేంద్ర విద్యాశాఖ చేస్తున్న ప్రయత్నాలను సైతం ఉపరాష్ట్రపతి అభినందించారు.

ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు భాషాభిమానులు, భాషావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మీడియా మాతృభాష పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ఉపరాష్ట్రపతి, మాతృభాష పరిరక్షణ కోసం వివిధ దేశాలు అనుసరిస్తున్న విధానాల నుంచి స్ఫూర్తిని పొందాలని స్పష్టం చేశారు. అన్ని శాస్త్రాలను వారి వారి భాషల్లో చదువుకుంటున్న ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, రష్యా, జపాన్, చైనా, ఇటలీ, బ్రెజిల్ తదితర దేశాలు అభివృద్ధి చెందిన ఆంగ్లదేశాలతో పోటీ పడుతున్నాయన్న ఆయన, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తమతమ మాతృభాషలు సంరక్షించుకునేందుకు అనుసరించిన విధానాలను కూలంకషంగా అధ్యయనం చేసి, మన మాతృభాషల అభివృద్ధికి ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు.

ఏ భాషైనా విశ్వవ్యాపితం కావడానికి, పరిపుష్టి చెందడానికి అనువాదాలు ఎంతో అవసరమన్న ఉపరాష్ట్రపతి, ఇతర భాషల సాహిత్యం తెలుగులోకి అనువాదం అవుతున్నంతంగా తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం కావడం లేదని, ఇందు కోసం తెలుగు వారంతా చొరవ తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రాచీన సాహిత్యాన్ని సరళ తెలుగులో యువతకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు ముమ్మరం కావాలన్న ఆయన, సాంకేతికంగా భాషా వినియోగం మరింత విస్తృతం కావాలని సూచించారు. వీటితో పాటు మారుమూల గ్రామాల నుంచి భాషాపదజాలాన్ని సమీకరించడం, అంతరిస్తున్న పదాలను వెలికి తీసి కాపాడుకోవడం, శాస్త్ర సాంకేతిక పారిభాషిక పదాలను తయారు చేయడం,వృత్తి పదకోశాలు, మాండలిక పదకోశాలు రూపొందించడం లాంటివిఆవశ్యకమని తెలిపారు.

తెలుగు భాషను కాపాడుకునే దిశగా తెలుగు కూటమి చేపట్టిన అనేక కార్యక్రమాలను అభినందించిన ఉపరాష్ట్రపతి,భాషగా మాత్రమే మాతృభాషలను నేర్చుకునే పరిస్థితి ఉండకూడదన్న తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. అన్ని స్థాయిల్లో మాతృభాష వినియోగం మరింత పెరగాలన్న ఆయన,చిత్తశుద్ధి ఉంటేనే కార్యసిద్ధి జరుగుతుందని నొక్కిచెప్పారు. మాతృభాషలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని గట్టిగా చెప్పడం వెనుక తన ఉద్దేశం ఇతర భాషలను అశ్రద్ధ చేయమని కాదని, యువతమాతృభాషతో పాటు, సోదర భాషలను కూడా అధ్యయనం చేయాలని, అదే సమయంలో మాతృభాష విషయంలో బలమైన పునాది కలిగి ఉండడం అత్యంత ఆవశ్యకమని సూచించారు.

భాషాభిమానం ఉండాలే గానీ దురాభిమానం తగదని.. ప్రతి ఊరిలోనూ రాజకీయాలకు అతీతంగా మాతృభాషను కాపాడుకునేందుకు తెలుగు కూటమి లాంటి బృందాలు ఏర్పడాలని, మన అమ్మ భాషను సజీవంగా ఉంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం కావాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు.ప్రజలు చైతన్యవంతమై ముందుకు వస్తే, ప్రభుత్వాలు కూడా భాషా పరిరక్షణకు మరింత ప్రోత్సాహాన్ని అందించే అవకాశం ఉంటుందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు తమ మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తే, ప్రజలు కూడా దాన్ని అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయ భాషలను ప్రోత్సహించాలనే సంకల్పమున్న ప్రధానమంత్రి, తెలుగుభాషాభివృద్ధిపై సానుకూలమైన ఆలోచన ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి కారణంగా భాషావికాసానికి బాటలు పడుతున్నాయన్న ఉపరాష్ట్రపతి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా తమ తమ ప్రాంతీయ భాషల అభివృద్ధికి కృషిచేయడం శుభపరిణామమన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుశ్రీ కె. వి. రమణాచారి, విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారిశ్రీ నందివెలుగు ముక్తేశ్వర రావు, విశ్రాంత ఐ.పి.ఎస్. అధికారిశ్రీ చెన్నూరు ఆంజనేయరెడ్డి, తానా మాజీ చైర్మన్శ్రీ తాళ్ళూరి జయశేఖర్, ద్రవిడ విశ్వవిద్యాలయ డీన్శ్రీ పులికొండ సుబ్బాచారి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ శ్రీ నందిని సిధారెడ్డి, భారత భాషాశాస్త్రవేత్తల సంఘం అధ్యక్షులుశ్రీ గారపాటి ఉమామహేశ్వర రావు, తెలుగు కూటమి అధ్యక్షులు శ్రీ పారుపల్లి కోదండరామయ్య సహా ప్రపంచంలోని పలు దేశాలకు దాదాపు వెయ్యిమంది తెలుగు భాషాభిమానులు, భాషావేత్తలు అంతర్జాలం ద్వారా హాజరయ్యారు.

ఎల్లుండి నుంచి పంజాబ్‌లో తెరుచుకోనున్న పాఠశాలలు

చండీగఢ్,జులై 31: పంజాబ్ రాష్ట్రంలో ఎల్లుండి నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఆగస్టు 2 నుంచి పాఠశాలల తెరవాలని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ అన్ని తరగతుల విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించింది. పాఠశాలల ఆవరణలోనూ కరోనా నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కరోనా ఉధృతి కారణంగా మార్చి 12 నుంచి పంజాబ్ ప్రభుత్వం పాఠశాలలకు ప్రివరేషన్ సెలవులు ప్రకటించింది. గత సోమవారం నుంచి ఇక్కడ 10, 11, 12వ తరగతి విద్యార్థులకు సైతం బడులు ప్రారంభమయ్యాయి. ఆరోగ్యశాఖ సూచన మేరకు పరిస్థితులకు అనుగుణంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు తరగతులు ప్రారంభించేందుకు పంజాబ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసింది.

రమణాచారి అధ్యక్షతన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు భేటీ

హైదరాబాద్ , జులై 31:తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కార్యనిర్వాహక కమిటీ సమావేశం శనివారం జరిగింది. పరిషత్తు అధ్యక్షులు కె.వి.రమణాచారి అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. 2021-22 విద్యాసంవత్సరానికి 62 మంది విద్యార్థులకు వివేకానంద విదేశీ విద్యాపథకం కింద ఉపకార వేతనాలు మంజూరు అయినట్లు తెలిపారు. అదేవిధంగా 266 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను త్వరలోనే రూ.7.46 కోట్ల రాయితీ త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నట్లు చెప్పారు. 75 ఏళ్లు పైబడిన 9 మంది పండితులకు రూ.2,500 గౌరవ వేతనం లభించనున్నట్లు తెలిపారు. నాగోల్‌లోని వేదపాఠశాలకు రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సెమీస్‌లో సింధు ఓటమి.. బ్రాంజ్ కోసం మరో మ్యాచ్



టోక్యో,జులై 31: ఇండియన్ బ్యాడ్మింటన్ సెన్షేషన్ పుసర్ల వెంకట సింధు (ఖఎ నాతినిటష్ట) టోక్యో ఒలింపిక్స్ వుమెన్ సింగిల్స్ సెమీస్‌లో ఓటమిపాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ తైజు యింగ్ (ంఎ ఎళిబీ-జతినిణ) చేతిలో 21-18, 21-12 స్కోర్‌తో హైదరాబాదీ ప్లేయర్ సింధు మ్యాచ్‌ను కోల్పోయింది. దీంతో సింధు గోల్డ్ ఆశలు ఆవిరయ్యాయి. అయితే బ్రాంజ్ మెడల్ కోసం ఆమె రేపు మరో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. 2016లో రియో ఒలింపిక్స్‌లో సిల్వర్ సాధించిన సింధు.. టోక్యోలో మాత్రం కాంస్య పతకం కోసం పోటీపడనున్నది.

గేమ్ వన్.. థ్రిల్లర్

ఇవాళ తొలి గేమ్‌లో ఆది నుంచి సింధూ రఫాడించింది. చక చకా పాయింట్లు సాధించింది. చైనీస్ తైపీ ప్లేయర్ తైజు యింగ్‌కు గట్టి పోటీనిచ్చింది. రెండవ ర్యాంక్‌లో ఉన్న తైపీ ప్లేయర్ కూడా తన ఆటతీరుతో ఆకట్టుకున్నా.. సింధు తన ట్యాలెంట్‌తో ఆశలు రేపింది. ముసాసినో ఫారెస్ట్ ప్లాజా స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో ప్రతి పాయింట్ ఆసక్తికరంగా సాగింది. ఇద్దరు ప్లేయర్లు ఒక్కొక్క పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించారు. 11-8 లీడింగ్‌లో ఉన్న దశలో మ్యాచ్ పై తైపీ ప్లేయర్ పట్టు సాధించింది. దీంతో ఓ దశలో ఇద్దరూ 13-13కు చేరుకున్నారు. భారీ స్మాష్‌లతో ఇద్దరూ టెన్షన్ పుట్టించారు. బేస్ లైన్, నెట్ గేమ్‌లో ఇద్దరూ హోరెత్తించారు. నువ్వే నేనా అన్నట్లుగా ప్రతి పాయింట్ కోసం పోరాడారు. మళ్లీ స్కోర్ 16-16కు చేరుకున్నది. తొలి గేమ్‌ను తైజు యింగ్ 21-18 స్కోర్ తేడాతో 21 నిమిషాల్లో సొంతం చేసుకున్నది.

తైజు సూపర్ షో..

రెండవ గేమ్ ఆరంభంలోనూ ఇద్దరూ ఒక్కొక్క పాయింట్‌తో టెన్షన్ పుట్టించారు. ఆ తర్వాత తైజు యింగ్ మెల్లమెల్లగా ఆటపై పట్టు సాధించింది. పాయింట్లను వేగంగా తన ఖాతాలో వేసుకున్నది. సింధు ఎంత పోరాడినా.. కీలకమైన పాయింట్లను సాధించలేకపోయింది. సింధును వత్తిడిలోకి తెచ్చిన తైపీ ప్లేయర్ గేమ్‌ను ఈజీగా గెలుచుకున్నది. 21-12 స్కోర్‌తో తైజుయింగ్ 19 నిమిషాల్లో గేమ్‌ను గెలిచి ఫైనల్లో ప్రవేశించింది.

కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ

రాజన్న సిరిసిల్ల, జులై 31:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామం లో జీపీ నిధులతో గ్రామపంచాయతీ కి కాంపౌండ్ వాల్ నిర్మాణం కొరకు శనివారం భూమి పూజ చేశారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ఉరిడి రాంరెడ్డి ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ ,ఉప సర్పంచ్ తాడం శ్రీనివాస్,ఏఎంసీ వైస్ చైర్మన్ ఊరిడిప్రవీణ్ , వార్డ్ సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్ లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పిల్లి కనకయ్య, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మెడికల్ రాజిరెడ్డి , కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులని కలిసిన రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు.

రాజన్న సిరిసిల్ల, జులై 31:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైనా బక్కని నరసింహులుని శుక్రవారం ఎన్టీఆర్ భవనంలో కలిసిన రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు.ఈ సందర్భంగా శాలువతో సత్కరించి శ్రీ రాజారాజేశ్వర స్వామి వారి ప్రసాదం అందజేయడం జరిగింది.బక్కని నరసింహులు గారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తీగల శేఖర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ముంజ ఉమేందర్ గౌడ్,టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోతె రాజిరెడ్డి, డాక్టర్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు....

దేశంలో అత్యంత ఖరీదైన ఎలక్షన్ హుజురాబాద్ ఉప ఎన్నిక

-ఓటమి భయంతో కేసీఆర్ టిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కొనడం విడ్డూరం

-హుజురాబాద్ లో ప్రజాస్వామ్యం అపహాస్యం

-కేసీఆర్ వైఖరితో ఘోషిస్తున్న తెలంగాణ

-బిజెపి కార్పొరేటర్.. బీజేపీ నగర సెంట్రల్ జోన్ అధ్యక్షుడు దుర్వేడ్ అనూప్ కుమార్

కరీంనగర్ జులై 31 (నేటినిజం ప్రతినిధి): దేశంలో అత్యంత ఖరీదైన ఎలక్షన్ హుజురాబాద్ ఉప ఎన్నిక అని, వందల కోట్ల అవినీతి ధన ప్రవాహం పల్లెల్లో ఏరులై పారుతోందని కరీంనగర్ 48వ డివిజన్ కార్పొరేటర్ , బిజెపి నగర సెంట్రల్ జోన్ అధ్యక్షుడు దుర్వేడ్ అనూప్ కుమార్ టిఆర్ఎస్ ప్రభుత్వం పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో అనూప్ మాట్లాడుతూ బిజెపి పార్టీకి ప్రజల్లో వస్తున్న అపూర్వ ఆదరణ చూసి ఓర్వలేక, ఈటెల రాజేందర్ విజయం ఖాయమని, జన ప్రవాహాన్ని చూసి తట్టుకోలేక, టిఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జి లు అభద్రతా భావంతో టిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కోట్ల రూపాయలతో కొనడం విడ్డురంగా ఉందని, హుజురాబాద్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. ఈటల ను నిలువరించడానికి అధికార యంత్రాంగాన్ని అనవసర బదిలీ చేసి, టిఆర్ఎన్ కు అనుకూలంగా వ్యవరించే అధికారులను తీసుకురావడమే ముందస్తుగా టిఆర్ఎస్ ఓటమిని అంగీకరించిడమేనని చెప్పారు. బీజేపీలో క్రియశీలంగా తిరుగుతున్న యువతను బెదిరింపులకు గురి చేస్తున్నారని, వారి తల్లిదండ్రులను పిలిచి బీజేపీలో తిరగనివ్వొద్దని హెచ్చరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొడ్డిదారిన గెలవడానికి టిఆర్ఎస్ నేతలు ఆయా గ్రామాల్లో భోగస్ ఓట్లు నమోదు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. భోగస్ ఓట్లను తొలగించేందుకు ఈ సీ చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా పారా మిలిటరీ బలగాలను రప్పించాలని కోరారు. ప్రభుత్వ ఖజానా నుండి లక్షలాది రూపాయల నిధులను తన సన్నిహితులకు చెందిన మేఘా, మైహోం వంటి కేసీఆర్ బినామీ కంపెనీలకు కాంట్రాక్టుల రూపంలో అప్పనంగా కట్టబెట్టి, అవినీతి పరంగా వచ్చిన అక్రమ డబ్బును ఎన్నికల్లో గెలవడానికి టిఆర్ఎస్ పార్టీకి విరాళంగా తీసుకొని వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని దుయ్యబట్టారు. టిఆర్ఎస్ ఖర్చు చేస్తున్న డబ్బులపై ఎన్నికల కమిషన్ నిఘా పెట్టాలని, టిఆర్ఎస్ నేతల సన్నిహితులైన ఇరిగేషన్, ఆర్ అండ్ బి, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, ఇన్ ఫ్రా స్ట్రక్చర్ కంపెనీలపై దృష్టి సారించాలాని కోరారు. హుజురాబాద్ లో 60 వేల పైచిలుకు ఓట్లు దళితులవి లేకుంటే దళితబంధు పథకం ఈ జన్మలో వచ్చేదా అని ప్రజలు ఆలోచించాలన్నారు. ఆగస్టు15 లోపు కేసీఆర్ ప్రభుత్వానికి దళితులపై చిత్తశుద్ధి ఉంటే హుజురాబాద్ లోని అన్ని దళిత కుటుంబాలకు తక్షణమే 10 లక్షలు ఖాతాల్లో జమ చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల తాయిలంగా దళితబంధు, తర్వాత బిసి బంధు, ఎన్నికలు అయిపోయాక అన్నీ బందు పెట్టి కేసీఆర్ ఫామ్ హౌజ్ లోకి, కేటీఆర్ ప్రగతి భవన్లో పడుకుంటారన్నారు. దళిత, బడుగు బలహీన వర్గాలు టిఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఒక్కటై ఈటల రాజేందర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, కేసీఆర్ మెడలు వంచాలని పిలుపునిచ్చారు.

హకర్స్ చేసే మోసాల పట్ల జాగ్రత్త గా ఉండండి.

- ఆన్లైన్ షాపింగ్ లో ఆఫర్లు చూసి నిర్ధారించుకోకుండా మోసపోవద్దు

-సైబర్ మోసాల పట్ల జాగ్రత్త --ఇన్స్పెక్టర్ వెంకటేష్

రాజన్న సిరిసిల్ల, జులై 31:(నేటినిజం ప్రతినిధి): ప్రస్తుత పరిస్థితులలో ఎక్కువ మంది ఆన్లైన్ షాపింగ్ చేయుటకు ఇష్టపడుతున్నారు ఇట్టి అవకాశం ను ఆసరాగా చేసుకొని ఆన్లైన్ ద్వారా మోసాలు చేయుటకు హకర్స్ ఎల్లప్పుడు సిద్ధం గా వుంటారు కాబట్టి ఆన్లైన్ ద్వారా షాపింగ్ కానీ మరి ఏ ఇతర రకాలుగా అయినా కూడా మోసపోకుండా ప్రజలు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలి అని పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. ప్రస్తుతం ఎక్కువగా మొబైల్ ఫోన్ లు ఆఫర్స్ అంటూ హకర్స్ వల విసిరి ఆకర్షణ కు గురిచేసి కొంత మొత్తం పంపితే మీకు ఆఫర్ లభిస్తుంది అని నమ్మించి అందిన కాడికి ఆన్లైన్ ద్వారా డబ్బులు పొంది తర్వాత అట్టి నెంబర్ ని బ్లాక్ చేస్తున్నారు, కొన్ని రకాల ఆమోదం పొందిన కంపెనీ ల పేరుతో కూడా నకిలీ కంపెనీ రూపొందించి ఇలా కూడా మోసం చేస్తున్నారు కాబట్టి జాగ్రత్త వహించాలి అని, అనవసరపు లింక్ ల మీద క్లిక్ చేయకూడదు అని, నకిలీ ప్రొఫైల్ చూసి మోసపోకూడదు అని,అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు అకౌంట్ కి సంబందించిన పిన్ వివరాలు అడిగితే తెలపకూడదు, హకర్స్ వైరస్ (మాల్వేర్) వాటిని మన మొబైల్, కంప్యూటర్ లలోకి పంపే అవకాశం చాలా వుంది కాబట్టి వాటి వల్ల కూడా జాగ్రత్త వహించాలి, జాబ్స్ అంటూ పెద్ద జీతాలు అంటూ మెయిల్స్ చేస్తూ లింక్ లు పంపుతూ మోసం చేస్తారు వీటి వల్లకూడా అప్రమత్తంగా ఉండాలి.పోలీస్ శాఖ తరుపున ఎప్పటికప్పుడు ఫేస్ బుక్, ట్విట్టర్ ద్వారా సైబర్ మోసాల గురించి ప్రజలను చైతన్య పరుస్తున్నాం అని తెలిపారు.

పిస్టాచియో (పిస్తా పప్పు) నూతన దృక్పథాలపై చర్చించిన అమెరికన్ పిస్టాచియో గ్రోయర్స్ (ఏపీజీ), ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్ (ఐడీఏ)



హైదరాబాద్ , జులై 31:ఈ మహమ్మారి సమయంలో మనమంతా కూడా రోగనిరోధకత, ఫిట్ నెస్, చురుకైన జీవనశైలి గురించి మాట్లాడుకుంటున్నాం. ఈ సందర్భానికి అది అనువైంది, అర్థవంతమైంది.

అన్ని ప్రాంతాలకు చెందిన డేటా మరియు అధ్యయన పత్రాలను ఒక్కటి చేస్తూ ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్ (ఐడీఏ), ఐడిఎ గుజరాత్ శాఖ, ఐడిఎ ఎస్ఐజి (వెల్ నెస్ ? ఫిట్ నెస్), అమెరికన్ పి స్టాచియో గ్రోయర్స్ (ఏపీజీ) కలసి పోషకాలపై ప్రజెంటేషన్ ఇచ్చాయి. అగ్రగామి ఆరోగ్యరంగ నిపు ణులు, పోషక నిపుణులు, ఫిట్ నెస్ శిక్షకులు, వైద్యులు బహుళ ప్రయోజనకారి అయిన ఆరోగ్యదా యక నట్ పిస్టాచియోస్ (పిస్తా పప్పు) పై తాజా అధ్యయనం దృక్పథాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జగ్ మీత్ మదన్ (ఐడీఏ నేషనల్ ప్రెసిడెంట్), డాక్టర్ భావన వేద్ (ఐడీఏ ? గుజరాత్,ప్రెసిడెంట్), షినయ్ సురేంద్రన్ (స్పోర్ట్స్ న్యూట్రిషనిస్ట్), శ్రీ సుమిత్ సరన్ (ఇండియా రిప్ర జెంటేటివ్ ఆఫ్ ఏపీజీ), డాక్టర్ మైక్ రౌసెల్ (పిహెచ్.డి న్యూట్రిషనిస్ట్, కాలమిస్ట్, యూఎస్ఏ మెన్స్ మ్యాగజైన్ కన్సల్టెంట్, అడ్వయిజర్), డాక్టర్ సీమా గులాటి, న్యూట్రిషనిస్ట్, మీల్ పిరమిడ్ వ్యవస్థాప కులు కినిటాకడాకియా పటేల్, శ్రీ సోహ్రాబ్ ఖుష్రుషాహి (సోహ్ ఫిట్ వ్యవస్థాపకులు) ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. హాజరైన వారిలో దేశం నలుమూలలకు చెందిన పోషక నిపుణులు, డైటీషియన్లు ఉన్నారు.

సెషన్ ను ప్రారంభిస్తున్న సందర్భంగా డాక్టర్ జగ్ మీత్ మదన్ మాట్లాడుతూ, "నట్స్ వెనుక ఎంతో సైన్స్ కూడా ఉంది, ఎందుకంటే అవి యాంటీఆక్సిడెంట్స్, ప్రొటీన్, ఫైబర్ లాంటివాటితో ఉంటాయి. ఈ కొత్త సమాచారంతో, అధ్యయనాలతో మేమెంతో ఆనందిస్తున్నాం. ఇది భారతీయ స్నాక్ రకాలకు చక్కటి జోడింపు అవుతుంది" అని అన్నారు.ఐడీఏ గుజరాత్ శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ భావనా వేద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎసెన్షియల్ అమినో యాసిడ్స్ యొక్క అత్యధిక నిష్పత్తితో కూడిన అతి తక్కువ కెలోరీలు ఉండే నట్స్ లో పిస్తా ప ప్పు ఒకటని అన్నారు.

మోదీ సర్కార్ ఏలుబడిలో సరిహద్దుల్లో అభద్రత : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జులై 31:అసోం-మిజోరాం సరిహద్దు వివాదం, వాస్తవాధీన రేఖ వెంబడి పరిస్థితుల వ్యవహారంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు.

మోదీ సర్కార్ చేతుల్లో అటు దేశ సరిహద్దులు కానీ ఇటు రాష్ట్ర సరిహద్దులు కానీ భద్రంగా లేవని ఆరోపించారు.

ఈ అంశంపై కాషాయ పార్టీ ప్రభుత్వం తీరును రాహుల్ తీవ్రంగా తప్పుపట్టారు.

రెండు ఈశాన్య రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం చిలికిచిలికి గాలివానగా మారడంతో జులై 26న అల్లర్లకు దారితీయడంతో ఆరుగురు అసోం పోలీసులు, ఓ పౌరుడు మరణించగా 50 మందికి పైగా గాయాలయ్యాయి.

అసోం-మిజోరం సరిహద్దుల్లో అల్లర్లు చెలరేగిన ప్రాంతంలో పెద్దసంఖ్యలో సీఆర్పీఎఫ్ బలగాలు మోహరించినా ఇంకా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. అసోం బారక్ వ్యాలీ జిల్లాలు కచర్, కరీంగంజ్, హిలాల్‌కండీలు మిజోరాంలోని ఐజ్వాల్, కొలసిబ్, మమిత్ జిల్లాలతో సరిహద్దు ప్రాంతం విస్తరించి ఉంది.

వైభవంగా ప్రారంభమైన శ్రీ ఉజ్జయిని మహంకాళి బ